వైఎస్ఆర్ కడప వార్త
తెలుగు జాతీయ దినపత్రిక
సోమవారం 01 జూన్ 2026



## గండి వీరాంజనేయ స్వామిని దర్శించుకున్న ఏపీ ప్రెస్ అకాడమీ చైర్మన్ ఆలపాటి సురేష్

వేంపల్లి మే 31 ప్రభాతవార్త



వైఎస్సార్ జిల్లా పులివెందుల నియోజకవర్గం చక్రాయపేట మండలంలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రం గండి వీరాంజనేయ స్వామి వారిని ఏపీ ప్రెస్ అకాడమీ చైర్మన్ ఆలపాటి సురేష్ ఆదివారం దర్శించుకున్నారు. ఆలయానికి విచ్చేసిన ప్రెస్ అకాడమీ చైర్మన్‌కు ఆలయ మర్యాదలతో అర్చకులు, అధికారులు ఘన స్వాగతం పలికారు. అనంతరం ఆలపాటి సురేష్ స్వామివారి గర్భాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు స్వామివారి శేషవస్త్రంతో ఆయనను సత్కరించి, తీర్థప్రసాదాలు అందజేశారు. గండి క్షేత్ర విశిష్టతను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రజలందరూ ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని స్వామివారిని వేడుకున్నట్లు తెలిపారు.

బద్వేలులో దొంగల

# హల్‌చల్

- 24 గంటలలో మూడు చోట్ల చోరీ
- నేషనల్ హైవేపైనే చోరీలు
- భయాందోళనకు గురవుతున్న పట్టణవాసులు
- కనపడని పోలీసు పెట్రోలింగ్





బద్వేలు, మే 31 ప్రభాతవార్త :

బద్వేలులో వరుసగా చోరీలు జరగడంతో ప్రజలు భయభ్రాంతులకు గురయ్యారు. 24 గంటలు గడవకముందే మూడు చోట్ల చోరీలు జరిగాయి. నిన్నటిదినం పట్టణంలోని శివరామక్రిష్ణనగర్‌లో పట్టపగలు చోరీ జరగగా బంగారు, నగలు దొంగిలించుకుపోగా అదే రోజు రాత్రి ప్రధాన రహదారి నేషనల్ హైవేపై రెండు చోట్ల పెద్ద దుకాణాలలో చోరీజరిగింది. ఈ చోరీ జరిగిన తీరును చూస్తే పెద్ద తెలివైన దొంగలు చేసిన దొంగతనంలా అర్థమవుతోంది. మైదుకూరు రోడ్డులోని ఎంసీ ఫర్నిచర్ షాపులోని పెద్ద షెట్టర్లను గడ్డపారలతో తొలగించి సైడ్ డోరు లాకులు పగులగొట్టారు. లోపల క్యాష్‌పెట్టెను చిందరవందర చేసి బీరువా తాళాలు పగులకొట్టి డబ్బుకోసం అన్వేషించారు. అదే సమయంలో నెల్లూరు రోడ్డులోని పాలిటెక్నిక్ కళాశాల వద్ద ఉన్న సియెట్ షాపులో షెట్టర్లను గడ్డపారలతో పగులకొట్టి దుకాణంలోకి వెళ్లారు. సియెట్ టైర్ల షాపులో ఎల్ఈడి బల్బులు నగదును తీసుకెళ్లారు. ఈ రెండు చోరీలు జరిగిన ప్రాంతంలో సీసీ కెమెరాలు ఉన్నప్పటికీ కేబుల్ కట్ చేసి షాపులలో ఉన్న సీసీ కెమెరాల మెమోరి కార్డులు, డిస్కులు తీసుకెళ్లారు. చోరీకి పాల్పడిన దొంగలు బయటపడకుండా ఉండేందుకు తెలివిగా చేశారని పోలీసులు అంటున్నారు. షాపుల షెట్టర్లు పెద్దవిగా ఉన్నప్పటికీ వాటిని పగులకొట్టడం కష్టమైనా వాటిని పగులకొట్టేందుకు గడ్డపారలు ఉపయోగించారంటే ఇది ఖచ్చితంగా ప్రణాళిక ప్రకారమే జరిగినట్లు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఎప్పుడు జనాలు హైవేపై అర్థరాత్రి ఒకరో, ఇద్దరో తిరుగుతున్నప్పటికీ ఈ చోరీలు జరిగాయంటే ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారు. ప్రత్యేక గ్యాంగ్ ఏదైనా బద్వేలులో దిగిందా అనే అనుమానం ప్రజలు వ్యక్తంచేస్తున్నారు. ముఖ్యంగా పోలీసు పహారా కరువైందని సమాచారం. ఇంతకుముందు రాత్రి పూట్ల పోలీసులు పెట్రోలింగ్ చేస్తూ గల్లిగల్లి తిరిగేవారని ఒకటినుంచి 3, 4 గంటల మధ్య ప్రతి ఏరియా లో పోలీసు సైరన్లు వినబడేవని ,ఇప్పుడు అవి మూగబోయాయని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పోలీసులు కూడా పూర్తిగా నిర్లక్ష్యంగా ఉండడం వలనే ఈ వరుస చోరీలు జరుగుతున్నాయని ప్రజలు అంటున్నారు.

జిల్లా పోలీస్ బాస్ పనితీరుపై

# ప్రభుత్వం సర్వే

చోటా బాస్‌ల అవినీతిని అడ్డుకునేది ఎవరు?



రాజంపేట, మే 31 ప్రభాతవార్త

పరిపాలనలో ప్రగతి పట్టాలు ఎక్కేలా, పనితీరుతో ప్రభుత్వ కీర్తి ప్రతిష్టలు పెంచేలా చేసేది జిల్లా కలెక్టర్లే అని నిన్నటి మొన్నటి వరకు ప్రభుత్వం భావించేది. క్షేత్రస్థాయిలో పోలీసుల పనితీరుతో కూడా ప్రభుత్వానికి చెడ్డ పేరు వస్తుంది. అందుకే రాష్ట్ర ప్రభుత్వం నిఘా వ్యవస్థల ద్వారానే కాకుండా నేరుగా ప్రజాభిప్రాయం కూడా సేకరించేందుకు నిర్ణయం తీసుకుంది. భాగంగా తాజాగా కడప జిల్లా ఎస్పీ పనితీరు ఎలా ఉంది, బాగుందా, పర్వాలేదా అన్న ప్రశ్నలతో ఐవిఆర్ఎస్ సర్వే ప్రభుత్వం చేపట్టింది. జిల్లా ఎస్పీగా నచికేత్ విశ్వనాథ్ బాధ్యతలు స్వీకరించిన తర్వాత జిల్లాలో ఆయన పనితీరుపై సర్వత్ర హర్షం వ్యక్తం అవుతోంది. అరాచక శక్తులను నేరుగా హెచ్చరిస్తున్నారు. సామాజిక మాధ్యమాల ద్వారా తీవ్ర హెచ్చరికలు చేశారు. అయితే ఎస్పీ పనితీరు బాగున్నా క్షేత్రస్థాయిలో పరిస్థితులు ఆశించిన స్థాయిలో లేవు. ఉదాహరణకు రాజంపేట సబ్ డివిజన్ పోలీస్ కేంద్రం. ఒక ఐపీఎస్ అధికారి ఉన్నారు. ఇద్దరు సీఐలు, ఇద్దరు ఎస్ఐలు ఉన్నారు. సబ్ డివిజన్ కేంద్రంలో పనిచేస్తున్న ఓ పోలీసు అధికారి అవినీతి తారస్థాయికి చేరింది. గతంలో అమెరికాలో ఉంటున్న టిడిపి నేత చెప్పింది చేసి ఎస్సీ,ఎస్టీ కమిషన్ నోటీసులు వరకు వెళ్లిన ఈ అధికారి ఆ తర్వాత కూడా మారలేదు. జిల్లా స్థాయి అధికారి కంటే అంతకంటే పై అధికారితో నేరుగా ఉన్న సంబంధాలతో రెచ్చిపోతున్నారు. సివిల్ కేసులు అంటే ఇష్టపడుతున్నారు. ఇరు వర్గాలను దోచుకుంటున్నారు. అధికార పార్టీ నేతలకు కూడా చుక్కలు చూపిస్తున్నారు. న్యాయం చేయమని నియోజక వర్గ స్థాయి నేతలు ఫోన్ చేసినా సరే అనడం తప్ప ఎవరు క్యాష్ ఎక్కువ ఇస్తే వారిపైనే మొగ్గు చూపుతున్నారు. పదేపదే సివిల్ కేసులలో తల దూర్చుతున్నారు. ఎంతగా అంటే రెవెన్యూ అధికారులను సివిల్ కేసులకు సంబంధించి అధికారిక పత్రాలు ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు. ఏమంటే 100 నెంబర్‌కు కాల్ వచ్చింది వెళ్తున్నామని సాకు చెబుతున్నారు. దీంతో ఈ సమస్య సబ్ కలెక్టర్ వరకు ఒక దశలో వెళ్ళింది. ఇటీవల కూచివారిపల్లె పంచాయతీ పరిధిలోని ఒక పెద్ద కుటుంబం అన్నదమ్ముల మధ్య చిన్న భూ సమస్య ఏర్పడితే ఒక సోదరిని పక్క ఏకపక్షంగా నిలిచి 10 లక్షలు సొమ్ము చేసుకొన్నట్లు బహిరంగంగా ఆరోపణలు వినిపిస్తున్నాయి. పొరుగు జిల్లాలోని తన ఇంటికి అవసరమైన ఖరీదైన వస్తువులను అరేంజ్ చేయించుకుంటున్నారు. ఇలాంటి అధికారిని తమ సర్వీస్లో చూడలేదని సిబ్బంది వ్యాఖ్యలు చేస్తున్నారు అంటే పరిస్థితి ఎంత దారుణంగా ఉందో ఊహించవచ్చు. ఈ పోలీసు అధికారి వచ్చిన తర్వాత రాజంపేటకు వచ్చిన ముగ్గురు అధికారులను ఉన్నతాధికారులు బదిలీ చేశారు. కానీఈ అవినీతి సామ్రాట్‌గా పేరుపొందిన ఈ అధికారి జోలికి మాత్రంవెళ్ళలేదు. ఇలాంటి పరిస్థితి క్షేత్ర స్థాయిలో ఉంటే జిల్లా ఎస్పీగా బాగా పనిచేస్తున్నా పట్టణ ,మండల స్థాయిలో పనిచేసే అవినీతి పోలీసుల అధికారులతో ప్రజల అవస్థలు పడుతున్నారు. క్షేత్రస్థాయి పోలీస్ అధికారుల పనితీరుపై కూడా ప్రభుత్వం ఐవిఆర్ఎస్ సర్వే ఎప్పటికప్పుడు చేస్తే బాగుంటుందని ప్రజల్లో సర్వత్ర అభిప్రాయం వ్యక్తం అవుతోంది. ఇంత అవినీతి ఒక సబ్ డివిజన్ కేంద్రంలో పనిచేసే ఒక అధికారి చేస్తున్నా చర్యలు లేవంటే ఏమనాలి? వ్యవస్థలో ఒక ఉన్నతాధికారి అండదండలు ఉంటే అవినీతి అక్రమాలకు లైసెన్స్ ఇచ్చినట్లా?

## మహిళల సాధికారతే లక్ష్యంగా రాష్ట్ర సేవికాసమితి

యర్రగుంట్ల: మే 31 ప్రభాతవార్త:

భారతదేశంలో మహిళల సాధికారత, స్వావలంబనే లక్ష్యంగా రాష్ట్ర సేవిక సమితి పని చేస్తోందని అఖిల భారతీయ సంవర్ధిని న్యాస్ ప్రచారిక మాధురి మరాటే తెలిపారు. యర్రగుంట్ల పట్టణంలోని ఏరువాక గంగమ్మ దేవాలయం నందు నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ అఖిల భారత సంవర్ధిని న్యాస్ ఆధ్వర్యంలో మహిళలకు సేంద్రియ వ్యవసాయం, మహిళల బాల సంస్కార కేంద్రాల నిర్వాహన, గర్భ సంస్కార, సనాతన ధర్మం పైన అవగాహన కల్పించారు. భారతీయ నారిమానులు అహల్యా భాయి హోల్కర్, ఝన్సీ లక్ష్మి భాయి, దేశం, ధర్మం పైన చైతన్యం కోసం పాటు పడిన మాతృ మూర్తుల గురించి నేటి యువతకు తెలియచేయటం, మహిళా సాధికారత, స్వావాలంబనా, ఆదర్శ కుటుంబం తదితర విషయాలపైన మహిళలకు వివరించడం జరిగింది. ధర్మ దేశ రక్షణ కుటుంబం నుండి మొదలవుతుందని, ఆ కుటుంబాన్ని ఆ రీతిలో తీర్చిదిద్దడంలో మహిళల పాత్ర ఎక్కువగా ఉంటుందని తెలిపారు. సంవర్ధిని న్యాస్ ఆర్గనైసింగ్ సెక్రటరీ గంట గురు లక్ష్మి మాట్లాడుతూ మాధురి మరాటే ఢిల్లీ కేంద్రంగా దేశమంతటా పర్యటిస్తూ మహిళల్లో చైతన్యం నింపుతూ ధర్మ దేశ రక్షణలో తమ జీవితాన్ని అంకితం చేశారని తెలిపారు. ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో మహిళలు పాల్గొనడం జరిగింది.



# బిర్లా ఓపెన్ మైండ్స్ స్కూల్ ఘన ప్రారంభం

విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడమే లక్ష్యం

ప్రొద్దుటూరు అర్బన్,మే 31, ప్రభాతవార్త





విద్యార్థులకు అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన నాణ్యమైన విద్యను అందించాలనే లక్ష్యంతో తాళ్లమాపురం పంచాయతీ పరిధిలోని ఎస్ఆర్ఐటి కళాశాల సమీపంలో ఏర్పాటు చేసిన బిర్లా ఓపెన్ మైండ్స్ స్కూల్‌ను ఆదివారం ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించి, రిబ్బన్ కట్ చేసి పాఠశాలను ప్రారంభించారు. కార్యక్రమానికి రాజకీయ, సామాజిక, విద్యా రంగాలకు చెందిన పలువురు ప్రముఖులు హాజరై యాజమాన్యానికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి మాట్లాడుతూ, నేటి పోటీ ప్రపంచంలో విద్యార్థులు అత్యుత్తమ విద్యను అభ్యసించడం ఎంతో అవసరమన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో కూడా నగరాలకు ఏమాత్రం తీసిపోని విద్యా సదుపాయాలు అందుబాటులోకి రావడం అభినందనీయమని పేర్కొన్నారు. విద్యార్థులలో జ్ఞానంతో పాటు నైతిక విలువలు, నాయకత్వ లక్షణాలు పెంపొందించే విద్యాసంస్థల అవసరం ప్రస్తుతం మరింత పెరిగిందన్నారు. బిర్లా ఓపెన్ మైండ్స్ వంటి ప్రతిష్ఠాత్మక విద్యాసంస్థలు జిల్లాలో విద్యా రంగ అభివృద్ధికి దోహదపడతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పాల్గొన్న బిర్లా ఓపెన్ మైండ్స్ స్కూల్ సౌత్ హెడ్ సందీప్ మాట్లాడుతూ, విద్యార్థులను కేవలం పరీక్షల్లో ఉత్తీర్ణులుగా కాకుండా సమాజానికి ఉపయోగపడే బాధ్యతగల పౌరులుగా తీర్చిదిద్దడమే తమ లక్ష్యమన్నారు. ఆధునిక బోధనా విధానాలు, సాంకేతిక పరిజ్ఞానం ఆధారిత విద్య, సృజనాత్మకతకు ప్రాధాన్యతనిస్తూ విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి కృషి చేస్తున్నామని తెలిపారు. దేశ వ్యాప్తంగా బిర్లా ఓపెన్ మైండ్స్ విద్యాసంస్థలు విశిష్ట గుర్తింపు పొందాయని, అదే స్థాయి ప్రమాణాలను తాళ్లమాపురం కేంద్రంలో కూడా అమలు చేస్తామని చెప్పారు. స్కూల్ కరస్పాండెంట్ శ్వేత బసిరెడ్డి మాట్లాడుతూ, స్థానిక విద్యార్థులకు మెరుగైన విద్యా అవకాశాలను అందించాలనే సంకల్పంతో ఈ విద్యాసంస్థను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. విద్యార్థుల్లో ప్రతిభను వెలికితీసే విధంగా ప్రత్యేక బోధనా కార్యక్రమాలు, క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాలు, వ్యక్తిత్వ వికాస శిక్షణలను అందించనున్నట్లు వెల్లడించారు. తల్లిదండ్రుల విశ్వాసాన్ని నిలబెట్టుకునేలా అత్యుత్తమ విద్యా వాతావరణాన్ని కల్పిస్తామని పేర్కొన్నారు. హెడ్‌మాస్టర్ సత్యలక్ష్మి మాట్లాడుతూ, విద్యార్థుల మేధో వికాసంతో పాటు వారి భావోద్వేగ, సామాజిక వికాసంపై కూడా ప్రత్యేక దృష్టి సారించనున్నట్లు చెప్పారు. అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులతో పాటు ఆధునిక తరగతి గదులు, స్మార్ట్ లెర్నింగ్ సదుపాయాలు, క్రీడా వసతులు విద్యార్థులకు అందుబాటులో ఉంటాయని వివరించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ నంద్యాల రాఘవరెడ్డి, మాజీ ఎమ్మెల్యే మల్లెల లింగారెడ్డి, టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ముక్తియార్, టీడీపీ మాజీ ఇన్‌చార్జి ప్రవీణ్ కుమార్ రెడ్డి, కొత్తపల్లి మాజీ సర్పంచ్ కొనిరెడ్డి శివచంద్రారెడ్డి, మాజీ కౌన్సిలర్లు మురళీధర్ రెడ్డి, కమాల్ బాష, తలారి పుల్లయ్య, టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి ఘంటసాల వెంకటేశ్వర్లు, నాయకులు శంకరాపురం ప్రసాద్ రెడ్డి, మండ్ల మల్లికార్జున, జనసేన నాయకుడు మంచి శివకుమార్‌తో పాటు స్కూల్ యాజమాన్య సభ్యులు బసిరెడ్డి రాజేశ్వరరెడ్డి, వీర కుమార్ రెడ్డి, వీర కళ్యాణ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ప్రారంభోత్సవం అనంతరం అతిథులు పాఠశాల భవనం, తరగతి గదులు, విద్యార్థులకు అందుబాటులో ఉంచిన విద్యా సౌకర్యాలను పరిశీలించారు. పాఠశాల యాజమాన్యం కల్పించిన మౌలిక వసతులు, విద్యా ప్రమాణాలను అభినందిస్తూ, ఈ విద్యాసంస్థ రానున్న రోజుల్లో ప్రాంతీయ విద్యా అభివృద్ధికి ఒక కేంద్రంగా నిలుస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమం ముగింపులో అతిథులను యాజమాన్యం సన్మానించి కృతజ్ఞతలు తెలిపింది.

గ్రామాలలో మౌలిక

# సదుపాయాలు కల్పించడమే ప్రధాన లక్ష్యం

టిడిపి అసెంబ్లీ ఇన్చార్జ్ జగన్మోహన్ రాజు



వాటర్ ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న జగన్మోహన్ రాజు



చమర్తివాండ్ల పల్లెలో పర్యటిస్తున్న జగన్ రాజు

రాజంపేట, మే 31 ప్రభాతవార్త

గ్రామీణ ప్రాంతాలలో రోడ్లు, తాగునీరు, డ్రైనేజీ లాంటి మౌలిక సదుపాయాలు కల్పించడమే తమ ప్రధాన లక్ష్యమని టిడిపి రాజంపేట అసెంబ్లీ ఇన్చార్జి జగన్మోహన్రాజు పేర్కొన్నారు. ప్రతి గ్రామంలో ఫ్లోరైడ్ రహిత నీటిని అందించేందుకు విస్తృతంగా మినరల్ వాటర్ ప్లాంట్ ను ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన వెల్లడించారు. ఆదివారం వీరబల్లె మండలం చమర్తివాండ్ల పల్లె, అచ్చిరాజు గారి పల్లెలో పర్యటించి 19 లక్షల వ్యయంతో నూతనంగా నిర్మించిన సి.సి రోడ్లను ముఖ్య నాయకులతో కలిసి చమర్తి ప్రారంభించారు. ఈ సందర్భంగా చమర్తి మాట్లాడుతూ ప్రతి పల్లెకు నాణ్యమైన రహదారులను ఏర్పాటు చేస్తున్నామన్నారు. అభివృద్ధి పనుల్లో నాణ్యతకు ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. గుర్రప్పగారి పల్లె, కొత్తవడ్డీ పల్లె గ్రామాల్లో మినరల్ వాటర్ ప్లాంట్స్ ను జగన్ మోహన్ రాజు ప్రారంభించారు. ప్రభుత్వ అభివృద్ధి సంక్షేమ పథకాలు కొనసాగుతున్నప్పటికీ, కొన్ని ప్రాంతాల్లో స్వచ్ఛమైన నీటి కొరత ఉందని గుర్తించి ఈ శుద్ధి కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు భానుగోపాలరాజు, సొసైటీ చైర్మన్ అమరేశ్వర రాజు, మాజీ మండల అధ్యక్షులు రెడ్డప్ప రెడ్డి, మాజీ సొసైటీ అధ్యక్షులు రామ్మోహన్‌రెడ్డి మండల ప్రధాన కార్యదర్శి రామాంజనేయులు, గుర్రప్ప గారి పల్లి గ్రామ అధ్యక్షులు వీరామృత నాయుడు, మండల క్లస్టర్ ఇంచార్జ్ చలపతి, కో కన్వీనర్ రమేష్, మాజీ సర్పంచ్ నాగార్జున చారి, సుబ్బరామరాజు, సాకి రాజు సుధాకర్ రాజు, కొండూరు వాసు దేవరాజు, గంగయ్య, వీరనాగయ్య, రామకృష్ణంరాజు, నాగప్ప నాయుడు, బాలరాజు, వెంకటరమణ, సురేందర్ రాజు, నాగసుబ్బయ్య నాయుడు, భాస్కర్ రాజు, సిద్దిరాజు, దుర్గం ఆంజనేయులు, మల్లికార్జున సుధాకర్, మట్టి గ్రామ కమిటీ అధ్యక్షులు లక్ష్మయ్య, వంగిమళ్ళ గ్రామ కమిటీ అధ్యక్షులు చిన్న మల్లయ్య యాదవ్, సానిపాయ్ రఘునాయుడు, సీతారామిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి



దువ్వూరు, మే 31, ప్రభాతవార్త:

వాహనాలు నడిపే సమయంలో వాహనాదాలు ట్రాఫిక్ నిబంధనలు ఖచ్చితంగా పాటించాలని ఎస్ఐ ధనుంజయుడు అన్నారు. ఆదివారం స్థానిక పోలీస్ స్టేషన్ వద్ద వివిధ రకాల వాహనాలను తనిఖీ చేసి రికార్డులు సక్రమంగా లేని వాటికి జరిమానాలు విధించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాహనాలు నడిపేవారు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, హెల్మెట్ ఉంటే ప్రమాదాల బారి నుండి రక్షించబడుతుందని అన్నారు. ఇప్పటికి కొంతమందిలో మార్పు రాలేదని, తప్పకుండా హెల్మెట్ ధరించాలన్నారు. కారు నడిపేవారు సీట్ బెల్ట్ ధరించాలన్నారు. రికార్డులు సరిగా లేని వాటికి ఆయన జరిమానాలు విధించారు.

## కేసీ కెనాల్ మరమ్మతులకు 40 లక్షలు మంజూరు

దువ్వూరు, మే 31, ప్రభాతవార్త:

మండల పరిధిలోని ప్రధాన కాలువ అయిన కేసి కాలువ మరమ్మతులకు గాను రాష్ట్ర ప్రభుత్వం 40లక్షల రూపాయలు నిధులు విడుదల చేసినట్లు అధికారులు తెలిపారు. రాజోలి వద్ద మెయిన్ గేట్ల మరమ్మతులకు గాను 20 లక్షల రూపాయలు అలాగే 11 కమ్మాన్ల వద్ద గత ఏడాది వర్షపు నీటికి పడిపోయిన గోడను నిర్మించేందుకు 15లక్షల రూపాయలు, దువ్వూరు బైపాస్ రోడ్డు నుండి నేల కమాన్ వరకు స్మశాన రహదారికి గ్రావెల్ రోడ్డు నిర్మించుటకు 5 లక్షల రూపాయలు నిధులు కేటాయించినట్లు తెలిపారు. పనులను త్వరలో పూర్తి చేస్తామని ఇంజనీరింగ్ అధికారులు పేర్కొన్నారు.

## ఇరుగులమ్మ తల్లికి ప్రత్యేక పూజలు

సిద్ధవటం, మే 31 ప్రభాతవార్త

ఇరుగులమ్మ తల్లి అమ్మవారి దేవస్థానంలో ఆదివారం భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు మండల కేంద్రమైన సిద్ధవటం, ఎగువపేట గ్రామానికి చెందిన అక్కిశెట్టి, సుబ్బరాయుడు, ధర్మపత్ని, కవిత కుటుంబీకులు ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహించి అమ్మవారి దర్శనానికి వచ్చిన భక్తుల



4వ పేజీలో



## గుర్తుతెలియని వ్యక్తి మృతి

నందలూరు, మే 31 ప్రభాతవార్త:
నందలూరులో నూతనంగా నిర్మించిన రైల్వే అండర్ బ్రిడ్జి (ఆర్‌యూబీ) పై నుంచి పడి గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందిన ఘటన ఆదివారం ఉదయం చోటుచేసుకుంది. పోలీసుల విచారణ లో ప్లాస్టిక్ వ్యర్థాలు ఏరుకొని జీవనం సాగించే ఓ యాచకుడు ఆర్‌యూబీ గోడపై నుంచి ప్రమాదవశాత్తూ కిందపడటంతో గాయపడ్డాడు. స్థానికుల సమాచారం మేరకు సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు క్షతగాత్రుడిని 108 అంబులెన్స్‌లో రాజంపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అయితే చికిత్స పొందుతూ అతడు మృతి చెందాడు. మృతుడి వివరాలు ఇంకా తెలియరాలేదని పోలీసులు తెలిపారు. ఆర్‌యూబీ గోడలపై తగిన భద్రతా ఏర్పాట్లు లేకపోవడం వల్ల ఇటువంటి ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## నీటి లీకేజీతో ప్రజల ఇక్కట్లు

### అధికారుల నిర్లక్ష్యంపై గ్రామస్తుల ఆగ్రహం




నందలూరు, మే 31 ప్రభాతవార్త:
నాగిరెడ్డిపల్లి పంచాయతీ పరిధిలోని కుమ్మరపల్లి గ్రామంలో గత కొంతకాలంగా నీటి పైపులైన్ లీకేజీ సమస్య తీవ్రంగా మారింది. లీకేజీ కారణంగా రోడ్డుపై నిరంతరం నీరు నిల్వ ఉండటంతో దోమలు ప్రబలుతూ ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్నాయి. ఈ సమస్యపై పలుమార్లు పంచాయతీ అధికారులకు విన్నవించినప్పటికీ స్పందన లేకపోవడంతో గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నిల్వ నీటి వల్ల అంటువ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందని, చిన్నారులు, వృద్ధులు ఎక్కువగా ఇబ్బందులు పడుతున్నారని వారు పేర్కొన్నారు.సంబంధిత అధికారులు వెంటనే స్పందించి నీటి లీకేజీని అరికట్టి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు. ప్రజారోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని తక్షణ చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

## ముద్దనూరులో వాసవి క్లబ్ కమిటీ ఏర్పాటు




ముద్దనూరు, మే 31, ప్రభాతవార్త:
ముద్దనూరు పట్టణంలో ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఆదివారం "వాసవి క్లబ్" కమిటీని ఘనంగా ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో సభ్యుల ఏకగ్రీవ నిర్ణయంతో నూతన కమిటీని ఎన్నుకున్నారు.క్లబ్ అధ్యక్షులుగా కంభం జగదీష్ కుమార్, కార్యదర్శిగా క్రిష్ణం నాగేంద్ర, కోశాధికారి కొత్త విశాలాక్షిని ఎంపిక చేశారు. అలాగే పలువురు ఆర్యవైశ్య ప్రముఖులను కమిటీ సభ్యులుగా నియమించారు.ఈ సందర్భంగా పలువురు సభ్యులు మాట్లాడుతూ ఆర్యవైశ్యుల ఐక్యత, సామాజిక సేవా కార్యక్రమాల అభివృద్ధి, యువతలో సేవాభావం పెంపొందించేందుకు వాసవి క్లబ్ కృషి చేస్తుందని తెలిపారు. సమాజ అభ్యున్నతి, విద్య, వైద్య మరియు సేవా కార్యక్రమాల్లో క్లబ్ చురుకుగా పాల్గొంటుందని పేర్కొన్నారు.నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులను పలువురు ఆర్యవైశ్య సంఘ నాయకులు, పెద్దలు అభినందిస్తూ, వారి పదవీకాలంలో క్లబ్ మరింత అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘ సభ్యులు, వ్యాపారవేత్తలు, యువకులు పాల్గొన్నారు.

## విందుకి హాజరైన ఎమ్మెల్సీ ఎమ్మెల్యే.



కాశినాయన మే 31 ప్రభాతవార్త:
బద్వేల్ నియోజకవర్గం శ్రీ అవధూత కాశినాయన మండలంలోని కొట్టాలపల్లి గ్రామంలో శ్రీశ్రీ పోలేరమ్మ పోతురాజు విగ్రహ ప్రతిష్ట పూర్తై 41 రోజులు పూర్తి అయిన సందర్భంగా గ్రామంలో ఘనంగా విందు కార్యక్రమం నిర్వహించారు. గ్రామస్తుల ఆహ్వానం మేరకు ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ సుధమ్మ, నియోజకవర్గ యువ నాయకుడు మరియు రాష్ట్ర విద్యార్థి విభాగం ప్రధాన కార్యదర్శి దేవసాని ఆదిత్య రెడ్డి, నియోజకవర్గ బూత్ కన్వీనర్లు సమన్వయకర్త కల్లూరి రమణారెడ్డి, నియోజకవర్గ మండల నాయకులతో కలిసి కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం పోలేరమ్మ గుడిని సందర్శించి ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామస్తులు, శాలువాలు, పూలమాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పలువురు పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

## ప్రతిభను ఎలుగెత్తి చాటుదాం

వేంపల్లె, మే 31. ప్రభాతవార్త
దేశంలోని వివిధ రంగాల్లో ప్రతిభావంతుల ప్రతిభను వెలికితీసి ప్రోత్సహించడమే ప్రధాని నరేంద్ర మోదీ లక్ష్యమని, ప్రతిభావంతుల ప్రతిభను ఎలుగెత్తి చాటాల్సిన అవసరం ఉందని బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి గాలి హరిప్రసాద్ అన్నారు. ఆదివారం వేంపల్లిలో నిర్వహించిన ప్రధాని మన్ కీ బాత్ కార్యక్రమం అనంతరం గాలి హరిప్రసాద్ మాట్లాడుతూ ప్రధాని నరేంద్ర మోదీ తన 134వ మన్ కీ బాత్ కార్యక్రమంలో క్రీడలు, నీటి సంరక్షణ, పర్యావరణ పరిరక్షణ, విద్య, యువత ప్రేరణ వంటి అంశాలపై మాట్లాడారని తెలిపారు. భారత అథ్లెటిక్స్ క్రీడాకారుల విజయాలను అభినందించడంతో పాటు, నీటి సంరక్షణకు కృషి చేస్తున్న వారిని ప్రధాని ప్రశంసించారని చెప్పారు. యువతలో ఖగోళ శాస్త్రంపై పెరుగుతున్న ఆసక్తి, దేశ నిర్మాణం కోసం సేవలందిస్తున్న వ్యక్తుల ప్రేరణాత్మక కథలను ప్రధాని ప్రస్తావించారని పేర్కొన్నారు.



## పవన్ కళ్యాణ్‌పై తప్పుడు ప్రచారాలు మానుకోవాలి

సిద్ధవటం, మే 31 ప్రభాతవార్త:
ప్రముఖ మేధావి ప్రొఫెసర్ నాగేశ్వరరావు వంటి వ్యక్తులు రాజకీయ నాయకుల ప్రభావానికి లోనై జనసేన పార్టీ అధ్యక్షుడు, ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌పై తప్పుడు ప్రచారాలు చేయడం బాధాకరమని రాజంపేట పార్లమెంటు జనసేన పార్టీ సమన్వయకర్త అతికారి కృష్ణ విమర్శించారు. సిద్ధవటంలోని తన నివాసంలో ఆదివారం ఆయన మాట్లాడుతూ పవన్ కళ్యాణ్ దేశం గర్వించదగ్గ నాయకుడని పేర్కొన్నారు. రాజకీయాల్లో విలువలు, పారదర్శకత, ప్రజా సేవకు ప్రాధాన్యత ఇస్తూ ప్రజల సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తున్న నాయకుడు పవన్ కళ్యాణ్ అని అన్నారు. వ్యక్తిగత ప్రయోజనాల కోసం కాకుండా సమాజ హితం కోసం పనిచేస్తున్న నాయకుడిపై ఆధారాలు లేని ఆరోపణలు చేయడం సమంజసం కాదని చెప్పారు. తెలంగాణ రాష్ట్రంలో వరదలు, ప్రకృతి విపత్తులు సంభవించిన సందర్భాల్లో పవన్ కళ్యాణ్ పలుమార్లు ఉదారంగా ఆర్థిక సహాయం అందించి బాధిత కుటుంబాలకు అండగా నిలిచిన విషయాన్ని ప్రజలు గుర్తుంచుకోవాలని అన్నారు. ప్రజల కష్టసుఖాల్లో భాగస్వామిగా ఉండే నాయకుడిపై అసత్య ప్రచారాలు చేయడం ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నమేనని విమర్శించారు. పవన్ కళ్యాణ్ సేవలను ప్రజలు గుర్తించి ఆయనకు మద్దతుగా నిలుస్తున్నారని, ఇటువంటి విమర్శలు ఆయన ప్రజాదరణను ఏమాత్రం తగ్గించలేవని అతికారి కృష్ణ స్పష్టం చేశారు. రాజకీయ విమర్శలు వాస్తవాల ఆధారంగా ఉండాలని, వ్యక్తిగత దూషణలు, నిరాధార ఆరోపణలు ప్రజాస్వామ్యానికి మంచివి కావని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి రాజంపేట పార్లమెంటు మాజీ ఉపాధ్యక్షుడు పుత్తా రామచంద్రయ్య, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ ప్రతినిధి దేరంగుల శ్రీకాంత్, సింగిల్ విండో అధ్యక్షుడు మాడా జయక్రిష్ణ, చేనేత వికాస రాష్ట్ర కార్యదర్శి రాటాల రామయ్య, నియోజకవర్గ జనసేన నాయకుడు కొరముట్ల హరి, మాజీ సింగిల్ విండో అధ్యక్షుడు సుధా మురళి, రాష్ట్ర పద్మశాలి సంక్షేమ సంఘం యువజన విభాగం కార్యదర్శి అవ్వారు రవిశంకర్, అతికారి చిన్న వెంకటయ్య, మునిస్వామి, మాజీ సర్పంచ్ ఓబులయ్య, వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ మహబూబ్ బాషా పసుపులేటి గంగయ్య, మైనారిటీ నాయకులు గౌస్ బాష, కూటమి పార్టీ నాయకులు పాల్గొన్నారు.



## రైతు కుటుంబానికి బీటెక్ రవి పరామర్శ

పులివెందుల, మే 31, ప్రభాత వార్త :
పులివెందుల మండలం ఈకొత్తపల్లె గ్రామానికి చెందిన రైతు బాలకృష్ణమూర్తి ఆర్థిక ఇబ్బందుల కారణంగా ఈ నెల 24వ తేదీన ఆత్మహత్యకు పాల్పడిన ఘటన విషాదకరమని పులివెందుల నియోజకవర్గ టీడీపీ ఇంచార్జ్ బీటెక్ రవి పేర్కొన్నారు. బాధిత కుటుంబానికి అండగా ఉంటామని హామీ ఇస్తూ ఆయన ఆదివారం కుటుంబ సభ్యులను స్వయంగా పరామర్శించారు. ఈ సందర్భంగా మృతుడి కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేసిన బీటెక్ రవి, వారి పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. కుటుంబం ఎదుర్కొంటున్న కష్టాలను గుర్తించి తక్షణ ఆర్థిక సాయంగా రూ.1 లక్షలను అందజేశారు. ఈ క్లిష్ట సమయంలో టీడీపీ పార్టీతో పాటు ప్రభుత్వం కూడా బాధిత కుటుంబానికి అన్ని విధాలా అండగా నిలుస్తుందని భరోసా ఇచ్చారు. రైతుల సంక్షేమం కోసం ప్రభుత్వం కట్టుబడి ఉందని, ఆర్థిక ఇబ్బందుల కారణంగా ఏ కుటుంబమూ ఇలాంటి విషాద పరిస్థితులను ఎదుర్కోకూడదని ఆయన అన్నారు. బాధిత కుటుంబానికి అవసరమైన సహాయ సహకారాలు అందేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు పుష్పనాథ్ రెడ్డి, పుష్పగిరి స్కూల్ కరస్పాండెంట్ ఓబుల్ రెడ్డి, ఈకొత్తపల్లె సింగిల్ విండో సొసైటీ అధ్యక్షుడు ఈశ్వర్ రెడ్డి, పులివెందుల మార్కెట్ యార్డ్ చైర్మన్ గడ్డం అమర్నాథ్ యాదవ్, వైస్ చైర్మన్ చంద్రవర్ధన్ రెడ్డి, నల్లగారి భాస్కర్ రెడ్డి, రాష్ట్ర హజ్ మరియు ఉర్దూ అకాడమీ డైరెక్టర్ మహబూబ్ బాషా, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం అందిస్తున్న బీటెక్ రవి

## అనుమానస్పదంగా యువకుడు మృతి..

యర్రగుంట్ల ,మే 31 ప్రభాతవార్త :



కలమల్ల పోలీస్ స్టేషన్ పరిధిలోని కొత్త గోపులాపురం కు చెందిన గోసుల శ్రీరాములు (22) అనుమానస్పదంగా మృతి చెందాడు. మృతుడు పాత గోపులాపురానికి చెందిన అంజలి అనే వివాహితతో గత కొన్ని సంవత్సరాలుగా సహజీవనం చేస్తున్నట్టు స్థానికులు తెలిపారు. విషయం తెలుసుకున్న జమ్మలమడుగు డీఎస్పీ వెంకటేశ్వరరావు, యర్రగుంట్ల సీఐ విశ్వనాద్ రెడ్డి, కలమల్ల ఎస్సై సునీల్ కుమార్ రెడ్డి ఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. మృతుడి గొంతు కింద కమిలిన గాయాలు ఉండడంతో ఆత్మహత్య చేసుకున్నాడా లేక ఎవరైనా హత్య చేశారా అనే కోణంలో పోలీసులు విచారిస్తున్నారు. మృతుడి అన్న ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

## ముగిసిన జాతర మహోత్సవాలు

దువ్వూరు, మే 31, ప్రభాతవార్త:
మండల పరిధిలోని చిన్న సింగన పల్లె, మాసనపల్లె గ్రామాలలో ఆదివారం జరిగిన జాతర ఉత్సవాలు వైభవంగా ముగిశాయి. ఈ రెండు గ్రామాల్లో వివిధ గ్రామ దేవతలకు మహిళలు బోనాలు సమర్పించారు. అలాగే వివిధ రకాల పూజలు, అభిషేకాలు నిర్వహించారు. గ్రామంలోని పెద్దమ్మ తల్లి, అంకాలమ్మ తల్లి, మల్లేలమ్మ తల్లి, పోలేరమ్మ తల్లి, భైరవ కొండయ్య స్వామి, గంగమ్మ తల్లి తదితర గ్రామదేవతలకు పూలతో అలంకరించి అభిషేకాలు, కుంకుమార్చనలు నిర్వహించారు. అనంతరం గ్రామంలోని మహిళలు బోనాలు అర్పించారు. ఈ ఉత్సవాలకు రెండు గ్రామాలు బంధువులు, స్నేహితులతో గడిపారు. ఈ జాతర ఉత్సవాలకు కడప ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి, మైదుకూరు మాజీ ఎమ్మెల్యే ఎస్. రఘురామి రెడ్డి, మండల వైకాపా కన్వీనర్ ఇరగంరెడ్డి శంకర్ రెడ్డి తదితర నాయకులు పాల్గొన్నారు.



## శాశ్వత మాస కళ్యాణమునకు విరాళం..



బ్రహ్మంగారిమఠం 31 ప్రభాతవార్త
భూత భవిష్యత్ వర్తమాన కాలజ్ఞానాన్ని రచించిన జగద్గురు శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి మాస కళ్యాణ మహోత్సవమునకు బెంగుళూరు టౌన్ జి. విజయ్ కుమార్ ధర్మపత్ని జయంతి మరియు వారి కుటుంబ సభ్యులు కార్తీక శుద్ధ ద్వాదశి రోజున శాశ్వత మాసకళ్యాణము జరిపించుటకు నిశ్చయించి ఒక లక్ష నూట పదహారు రూపాయలు చెల్లించారు. వీరికి మఠాధిపతులు శ్రీ వీర ధర్మజ వెంకటాద్రి స్వామి వారి అనుమతి మేరకు మేనేజరు ఈశ్వరయ్య చారి శాలువాతో సత్కరించి తీర్థప్రసాదాలు అందజేశారు. ఆలయ సిబ్బంది ఆదాని వెంకట నారాయణ, శ్రీనివాసులు పాల్గొన్నారు.

## చట్టసభల్లో మహిళలకు 33శాతం రిజర్వేషన్లు రావడం తథ్యం

### ఆ క్రెడిట్ కోసం తెలుగుదేశం పార్టీ తహతహ.

### డాక్టర్ నర్రెడ్డి తులసి రెడ్డి.

వేంపల్లి:మే 31 ప్రభాతవార్త



చట్టసభల్లో మహిళలకు 33శాతం రిజర్వేషన్లు రావడం తథ్యమని రాజ్యసభ మాజీ సభ్యులు, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర మీడియా చైర్మన్ డాక్టర్ నర్రెడ్డి తులసి రెడ్డి అన్నారు. ఆదివారం వేంపల్లి లో తులసి రెడ్డి మీడియా సమావేశంలో మాట్లాడుతూ వచ్చే పార్లమెంటు సమావేశాలలో మహిళా బిల్లు ప్రవేశపెట్టక తప్పదని,కాంగ్రెస్ పార్టీతో సహా అన్ని పార్టీలు మద్దతు ఇస్తాయని,బిల్లు ఏకగ్రీవంగా ఆమోదం పొంది చట్టం అవుతుందని, 2029 సార్వత్రిక ఎన్నికల నుండి అటు లోక్ సభలో, ఇటు రాష్ట్ర అసెంబ్లీలలో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు అమలు అవుతాయని తులసి రెడ్డి బల్ల గుద్ది చెప్పారు. ఈ విషయం తెలుగుదేశం పార్టీ నాయకులకు తెలుసు. ఆ క్రెడిట్ ఏదో తామే దక్కించుకోవాలని తెలుగుదేశం పార్టీ నాయకులు ఆరాటపడుతున్నారని తులసి రెడ్డి అన్నారు. అందుకోసమే 2029 సార్వత్రిక ఎన్నికల నుండి తెలుగుదేశం పార్టీ పరంగా మహిళలకు చట్టసభల్లో 33 శాతం సీట్లు కేటాయిస్తామని మహానాడులో తీర్మానం చేయడం జరిగిందన్నారు "గాలికి పోయే పేలపిండి కృష్ణార్పణం "అన్నట్టుంది టిడిపి వాలకం అని తులసిరెడ్డి ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ పార్టీ మొదటి నుండి మహిళల రాజకీయ, సామాజిక, ఆర్థిక సాధికారిత కోసం కృషి చేస్తోంది. మహిళా మణులైన అనీబిసెంట్, సరోజినీ నాయుడు, ఇందిరమ్మ, సోనియమ్మలు కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షులుగా సేవలందించారు. కాంగ్రెస్ పార్టీ తరపున ప్రతిభాపాటిల్ రాష్ట్రపతిగా, ఇందిరాగాంధీ ప్రధానమంత్రిగా, మీరా కుమార్ లోక్ సభ స్పీకర్‌గా సేవలందించారు. ఎందరో మహిళలు కాంగ్రెస్ పార్టీ తరపున ముఖ్యమంత్రులు,గవర్నర్లు అయ్యారు. దేశానికి స్వాతంత్రం వచ్చాక అమెరికా 143 సంవత్సరాల తర్వాత మహిళలకు ఓటు హక్కు కల్పించింది.700 సంవత్సరాల తర్వాత బ్రిటన్ మహిళలకు ఓటు హక్కు కల్పించింది.కానీ కాంగ్రెస్ ప్రభుత్వం స్వాతంత్రం వచ్చిన తర్వాత మొదటి సార్వత్రిక ఎన్నికల నుండే మహిళలకు ఓటు హక్కు కల్పించింది అని తులసి రెడ్డి అన్నారు. 73,74 రాజ్యాంగ సవరణల ద్వారా కాంగ్రెస్ ప్రభుత్వం 1993 నుంచి స్థానిక సంస్థల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పించింది. గ్రామీణ మహిళల ఆర్థిక సాధికారిత కోసం 1982 83 నుంచి కాంగ్రెస్ ప్రభుత్వం డ్వాక్రా పథకాన్ని అమలు చేస్తోంది. ఆంధ్రప్రదేశ్లో సున్నా వడ్డీ, పావలా వడ్డీ పథకాలను అమలు చేసింది. విద్యా, ఉద్యోగాలలో 33శాతం మహిళలకు రిజర్వేషన్లు కల్పించిన ఘనత కాంగ్రెస్ పార్టీది. గృహిణుల కోసం అమ్మహస్తం,బాలికల కోసం బంగారు తల్లి పథకాలను కాంగ్రెస్ ప్రభుత్వాలు అమలు చేశాయని తులసిరెడ్డి వివరించారు. తెలుగుదేశం పార్టీకి మహిళా సాధికారిత పట్ల చిత్తశుద్ధి ఉంటే కింద పేర్కొన్న వాటిని అమలు చేయాలని తులసి రెడ్డి డిమాండ్ చేశారు. తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్ష పదవి, ముఖ్యమంత్రి పదవి ఈ రెండింటిలో ఒకదానిని మహిళలకు కేటాయించాలి. ఆడబిడ్డ నిధి కింద 1959 సంవత్సరాల మధ్య వయసు ఉన్న ప్రతి ఆడబిడ్డకు నెలకు 1500 రూపాయలు ఆర్థిక సాయం చేస్తామని సూపర్ సిక్స్ హామీలలో పేర్కొనడం జరిగింది . ఈ హామీని వెంటనే అమలు చేయాలి. డ్వాక్రా సంఘాలకు ఒక్కొక్క సంఘానికి 10 లక్షల రూపాయల వరకు వడ్డీ లేని రుణాలు ఇస్తామని టిడిపి మేనిఫెస్టోలో చెప్పడం జరిగింది. గత రెండు సంవత్సరాలుగా ఈ పథకం అమలు కావడం లేదు. వడ్డీ భారంతో మహిళలు రుణగ్రస్తులయ్యారు. వడ్డీ బకాయిలు చెల్లించి వెంటనే ఈ పథకాన్ని అమలు చేయాలి. సబ్సిడీ ధరకు తొమ్మిది నిత్యావసర సరుకులు సరఫరా చేసే అమ్మ హస్తం పథకాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేసింది. ఈ పథకాన్ని పునరుద్ధరించాలి. బాలికల బంగారు భవిష్యత్తు కోసం కాంగ్రెస్ ప్రభుత్వం బంగారు తల్లి పథకాన్ని అమలు చేసింది. ఈ పథకాన్ని పునరుద్ధరించాలి.

## ఋగ్వేద నిధి, శతాధిక వృద్ధులు డాక్టర్ ఐలా వజ్జుల రామకృష్ణ శాస్త్రి ఇక లేరు

### నివాళులర్పించిన కడప జిల్లా డీసీసీ బ్యాంక్ చైర్మన్ సూర్యనారాయణ రెడ్డి, పలువురు నాయకులు

బద్వేల్ అర్బన్, మే 31: ప్రభాతవార్త :
ఆధ్యాత్మిక నగరమైన బద్వేల్ పట్టణంలో ఒక అద్భుతమైన జ్ఞాన శకం ముగిసింది. ప్రముఖ ఋగ్వేద పండితులు, ప్రతిష్ఠా గ్రంథ సంకలనకర్త, అపర అమ్మవారి ఉపాసకులు డాక్టర్ ఐలా వజ్జుల రామకృష్ణ శాస్త్రి శివైక్యం చెందడం ఆధ్యాత్మిక లోకానికి తీరని లోటు. నూరేళ్లకు పైగా (శతాధిక) సార్థక జీవనాన్ని గడిపిన ఆయన, తన జీవితాంతం వేద విజ్ఞాన వ్యాప్తికి, ధర్మ రక్షణకు అంకితం చేశారు. రామకృష్ణ శాస్త్రి కేవలం పూజా కార్యక్రమాలకే పరిమితం కాకుండా, ఎన్నో విలువైన ప్రతిష్ఠా గ్రంథాలను సంకలనం చేసి రాబోయే తరాలకు ఆధ్యాత్మిక నిధిని అందించారు. అమ్మవారి ఉపాసకులుగా ఉంటూ, బద్వేల్ ప్రాంతంలో ఎన్నో దేవాలయాల ప్రతిష్ఠాపనల్లో, ధార్మిక కార్యక్రమాల్లో ఆయన ముఖ్య భూమిక పోషించారు. వందేళ్ల వయసు దాటినా కూడా ఆయన ముఖంలో కనిపించే వేద వర్చస్సు, ఆధ్యాత్మిక తేజస్సు చూసేవారికి భక్తిభావాన్ని కలిగించేవి. శాస్త్రి గారి మరణవార్త తెలియగానే ఉమ్మడి కడప జిల్లా డీసీసీ బ్యాంక్ చైర్మన్ శ్రీ మంచూరు సూర్యనారాయణ రెడ్డి బద్వేల్‌లోని ఆయన నివాసానికి చేరుకున్నారు. శాస్త్రి భౌతిక కాయానికి పూలమాల వేసి అశ్రు నయనాలతో నివాళులర్పించారు. ఈ సందర్భంగా మంచూరు సూర్యనారాయణరెడ్డి మాట్లాడుతూ "డాక్టర్ ఐలా వజ్జుల రామకృష్ణ శాస్త్రి బద్వేల్ ప్రాంతానికే కాకుండా, యావత్ సమాజానికి ఒక గొప్ప మార్గదర్శి. నూరేళ్ల పైన జీవించి, ఎన్నో పుస్తకాలు రాసి, వేద విద్యను బతికించిన ఆయన సేవలు చిరస్మరణీయం. వారి మరణం ఆధ్యాత్మిక రంగానికి పెద్ద వెలితి." అనంతరం సూర్యనారాయణ రెడ్డి మృతుని కుటుంబ సభ్యులను పరామర్శించి, వారికి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. భగవంతుడు వారి ఆత్మకు సద్గతులు ప్రసాదించాలని, కుటుంబానికి మనోధైర్యాన్ని ఇవ్వాలని ఆకాంక్షించారు. శాస్త్రికి నివాళులర్పించిన వారిలో తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు, పట్టణ ప్రముఖులు, ఆయన భక్తులు, శిష్యులు ఉన్నారు.




### విద్యార్థుల మానసిక, శారీరక ఉల్లాసానికి

## నృత్యం, ఆటపాటలు ఎంతగానో దోహద పడుతాయి

ప్రొద్దుటూరు అర్బన్, మే 31, ప్రభాత వార్త :
నృత్యం ఆటపాటలు విద్యార్థుల మానసిక, శారీరక ఉల్లాసానికి ఎంతగానో దోహద పడుతాయని మైలవరం ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ భూషణ్ రెడ్డి తెలిపారు. ఆదివారం స్థానిక శ్రీకృష్ణ గీతాశ్రమంలో పసిడిపురి వసంతోత్సవం పేరుతో నటరాజ కళాక్షేత్రం ఆధ్వర్యంలో ఆదివారం గోపికా క్రిష్ణ అవార్డుల ప్రధానోత్సవం వేసవి నృత్య శిక్షణ శిబిరం ముగింపు కార్యక్రమం జరిగింది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆర్టీపీపీ డిఈఈ జి.శ్రీనివాసులు హాజరయ్యారు. మైలవరం ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ భూషణ్ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు కళల్లో రాణించడం అభినందనీయ మన్నారు. నృత్యం ఆటపాటలు విద్యార్థుల మానసిక, శారీరక ఉల్లాసానికి ఎంతగానో దోహద పడుతాయన్నారు. తల్లిదండ్రులు నృత్యం, సంగీతం, వాయిద్యం వంటి వాటిలో చిన్నారులను ప్రోత్సహించడం హర్షణీయ మన్నారు. నటరాజ కళాక్షేత్రం నాట్య గురువు మోహిద్దీన్ ఖాన్ మాట్లాడుతూ కళలను ప్రోత్సహిం చాలనే ఉద్దేశంతో తాము ఈ వసంతోత్సవం పేరుతో కూచిపూడి, భరతనాట్యం, జానపద నృత్య ప్రదర్శన, గోపికాక్రిష్ణ అవార్డుల ప్రధానోత్సవం నిర్వహించా మన్నారు. కడప, ఆళ్లగడ్డ, ప్రొద్దుటూరు ప్రాంతాలకు చెందిన 200 మంది పైగా చిన్నారుల నృత్య ప్రదర్శన అందరిని ఆకట్టుకుంది. కూచిపూడి, భరతనాట్యం. భక్తిగీతాల ఆలాపన, జానపదనృత్యం, సంగీతం, సెమీక్లాసికల్, సెమీ గ్రూప్ డాన్సులో విభాగాలలో నృత్యప్రదర్శన జరిగింది. 120 మంది చిన్నారులకు గోపికా క్రిష్ణ అవార్డు. 80 మంది చిన్నారులకు పార్టిసిపేషన్ సర్టిఫికెట్లను అందచేశారు. కార్యక్రమంలో కళాకారులు, కళాభిమానులు. నాట్యగురువులు. విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.



## ప్రతిభావంతులైన తొగట వీర క్షత్రియ విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు

ప్రొద్దుటూరు, మే 31 ప్రభాతవార్త
శ్రీ చౌడేశ్వరి తొగట వీర క్షత్రియ సేవా సంఘం ఆధ్వర్యంలో 14వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం స్థానిక రామేశ్వరంలోని తొగట వీర క్షత్రియ కళ్యాణ మండపంలో ప్రతిభా పురస్కారాల ప్రదానోత్సవం ఘనంగా నిర్వహించారు. 10వ తరగతి నుంచి బీటెక్, ఐఐటీ వరకు వివిధ కోర్సుల్లో విశిష్ట ప్రతిభ కనబరిచిన విద్యార్థులను ఈ సందర్భంగా సన్మానించారు. ముఖ్య అతిథులుగా గ్రూప్ వన్ లో సాధించి నంద్యాల డిప్యూటీ కలెక్టర్ గా ఎంపికైన ప్రియాంక, సీఐలు వంశీనాథ్, నరేష్ బాబు, డాక్టర్ తేజ హాజరై విద్యార్థులను అభినందించారు. కష్టపడి చదివితే ఉన్నత శిఖరాలు చేరుకోవచ్చని, విద్యతో పాటు క్రమశిక్షణ, నైతిక విలువలు అవసరమని సూచించారు. సంఘం అధ్యక్షులు బండారు సూర్యనారాయణ మాట్లాడుతూ ఆర్థిక ఇబ్బందుల కారణంగా చదువు మధ్యలో ఆపే పరిస్థితి వస్తే తమను సంప్రదించాలని, విద్య కొనసాగింపుకు సహాయం అందిస్తామని తెలిపారు. ఈ సందర్భంగా సిపిఎం ఇంటర్మీడియట్‌లో స్టేట్ మొదటి సాధించిన విద్యార్థి మన ప్రొద్దుటూరు తొగట వీర క్షత్రియ కులానికి చెందిన వాడు కావడం మనమెంతో గర్వించదగ్గ విషయమన్నారు ఈ సందర్భంగా ఆ విద్యార్థిని అభినందించారు. ఈ కార్యక్రమంలో తొగట వీర క్షత్రియ కళ్యాణ మండపం వ్యవస్థాపక అధ్యక్షులు బండారు రఘురామయ్య మాజీ కౌన్సిలర్ గంజికుంట ఆంజనేయులు ప్రముఖ కళాకారులు కంభం పాములేటి మరియు కుల బాంధవులు పెద్ద సంఖ్యలో విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.




## ప్రొద్దుటూరులో ఐదుగురు ఆర్టీసీ ఉద్యోగులు పదవీ విరమణ

ప్రొద్దుటూరు అర్బన్, మే 31 ప్రభాతవార్త
ప్రొద్దుటూరు ఆర్టీసీలో పనిచేస్తున్న ఐదుగురు ఉద్యోగులు ఆదివారం స్థానిక ఆర్టీసీ గ్యారేజ్ లో ఏర్పాటుచేసిన సమావేశంలో పదవి విరమణ చేశారు. అక్కడ పనిచేస్తున్న ఆర్టీసీ ఉద్యోగులు వారిని ఘనంగా సన్మానించారు.పదవి విరమణ చేసిన వారిలో ఏడిసి ఎంఎస్ రావు, డ్రైవర్లు రమణయ్య, కరుణాకర్, కండక్టర్లు వి. సరోజ, టి. బాబయ్య ఉన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ డిపో మేనేజర్ గంగాధర్ మాట్లాడుతూ విధి నిర్వహణలో అంకితభావంతో పనిచేసి అందరి మన్ననలు పొంది నేడు పెదవి విరమణ చేసిన వారికి ఆయన ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలోట్రాఫిక్ ఇన్స్పెక్టర్ వెంకటసుబ్బయ్య, రాష్ట్ర ఉపాధ్యక్షుడు పివి శివారెడ్డి, రీజనల్ సెక్రటరీ సుధాకర్, మాజీ కౌన్సిలర్ వంగనూరు మురళీధర్ రెడ్డి, మాజీ కౌన్సిలర్ ముదిరెడ్డి వెంకటసుబ్బారెడ్డి, టౌన్ బ్యాంకు మాజీ చైర్మన్ ఎల్లాల కుమార్ రెడ్డి, ఆర్టీసీ ఉద్యోగులు,కండక్టర్లు, డ్రైవర్లు పాల్గొన్నారు.



# పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

**నందలూరు, మే 31 ప్రభాతవార్త :**
కాలం ఎంత మారినా గురుశిష్య బంధం చెదరదనే విషయాన్ని నందలూరు జిల్లా పరిషత్ హైస్కూల్ పూర్వ విద్యార్థులు మరోసారి చాటిచెప్పారు. 1983 84 టెన్త్ బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులు ఆదివారం నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనం పాత జ్ఞాపకాలను తడిమి, గురువుల పట్ల తమకున్న కృతజ్ఞతను వ్యక్తం చేసిన వేదికగా నిలిచింది.జిల్లాలో ఐఎస్ హైస్కూల్‌గా గుర్తింపు పొందిన ఈ విద్యాసంస్థలో నిర్వహించిన కార్యక్రమానికి ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసులు అధ్యక్షత వహించారు. తమ జీవితాలకు పునాది వేసిన ఉపాధ్యాయులు కులాయిరెడ్డి, వెంప నాగయ్య, రామసుబ్బన్న, సాంబయ్య, వెంకటసుబ్బయ్య, కృష్ణయ్యలను పూర్వ విద్యార్థులు శాలువాలు కప్పి, గజమాలలతో ఘనంగా సన్మానించారు. పండ్లు, స్వీట్లు అందజేస్తూ గురువుల పట్ల తమ అభిమానాన్ని చాటుకున్నారు.ఈ సందర్భంగా మాట్లాడిన ఉపాధ్యాయులు, విద్యార్థులు వివిధ రంగాల్లో ఉన్నత స్థానాలను అధిరోహించడం గురువులకు లభించే గొప్ప గౌరవమని పేర్కొన్నారు. దశాబ్దాల తర్వాత తమను గుర్తు చేసుకుని సత్కరించడం హర్షణీయమని, ఇది గురుశిష్య సంబంధాల గొప్పతనానికి నిదర్శనమని అన్నారు.భ్రమరాంబిక, నజీ మున్నిసా ప్రార్థన గీతాలతో ప్రారంభమైన కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు తమ పాఠశాల రోజుల అనుభవాలను, గురువులతో ఉన్న అనుబంధాన్ని గుర్తు చేసుకుంటూ భావోద్వేగానికి లోనయ్యారు. సహచరులతో కలిసి గడిపిన మధుర క్షణాలను నెమరువేసుకుంటూ ఆనందాన్ని పంచుకున్నారు.కార్యక్రమంలో పూర్వ విద్యార్థుల కమిటీ ప్రతినిధులు ఆవుల మధు, అంకన్న, చెక్కా రామచంద్ర, రామ్మోహన్, సౌత్ వెస్ట్రన్ రైల్వే డిప్యూటీ చీఫ్ మెకానికల్ ఇంజనీర్ ఆంజనేయులు, ఆర్టీసీ నేషనల్ మజ్దూర్ నాయకుడు శివయ్య, ఎద్దుల పవన్, గొల్లపల్లి మల్లి, తులసి, శైలజ, నజీ మున్నిసాతో పాటు రాజంపేట, హైదరాబాద్, కడప తదితర ప్రాంతాల నుంచి వచ్చిన పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు. అనంతరం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు సందడిని నింపాయి. పాత మిత్రులు, గురువులు ఒకేచోట చేరి జ్ఞాపకాలను పంచుకోవడం ద్వారా ఈ సమ్మేళనం ఆత్మీయతకు ప్రతీకగా నిలిచింది. గురువులను గౌరవిస్తూ, విద్యాసంస్థతో తమ అనుబంధాన్ని చాటుకుంటూ పూర్వ విద్యార్థులు నిర్వహించిన ఈ కార్యక్రమం అందరి ప్రశంసలు అందుకుంది.



# మహిళల భద్రతకు జిల్లా యంత్రాంగం ప్రాధాన్యత

**రాజంపేట, మే 31 ప్రభాతవార్త**
జిల్లా ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్ మహిళా భద్రతకు ప్రాధాన్య తీస్తున్నట్లు, దీన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలని రాజంపేట పట్టణ ఎస్.ఐ వెంకటేష్ కోరారు. రాజంపేట పట్టణ పరిధిలోని సున్నపురాళ్లపల్లె లో మహిళలకు అవగాహన కార్యక్రమాన్ని ఎస్పై నిర్వహించారు. జిల్లా పోలీస్ యంత్రాంగం మహిళా భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, పాఠశాలలు, కళాశాలల్లో, వర్కింగ్ విమెన్స్ హాస్టళ్లలో, మహిళలు ఉద్యోగాలు చేసే కంపెనీలలో, గ్రామాలలో, కాలనీలలో మహిళా భద్రతపై అవగాహన కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహిస్తున్నామన్నారు. శక్తి యాప్ మహిళలు, బాలికల రక్షణకు అత్యవసర పరిస్థితుల్లో ఎంతగానో ఉపయోగపడుతుందని ఎస్.ఐ వెంకటేష్ తెలిపారు. ఈ యాప్ యొక్క ప్రాముఖ్యత, దానిని ఎలా ఉపయోగించాలనే దానిపై మహిళలకు వివరించారు. శక్తి యాప్‌ను ఏదైనా అపాయం లేదా అనుకోని ఘటన జరిగి ప్రమాదంలో ఉన్నపుడు శక్తి యాప్ ద్వారా తక్షణ సాయం పొందవచ్చన్నారు. ఎస్.ఓ.ఎస్ బటన్, డయల్ 112 నెంబర్ కు కాల్ చేసిన కేవలం 10 నిమిషాల్లో మీ చెంతకు పోలీసులు చేరుకొని సమస్య పరిష్కరించే దిశగా చర్యలు చేపడతారన్నారు.ఈ సందర్భంగా మహిళలు, చిన్నారులపై జరిగే నేరాలు, సైబర్ మోసాల గురించి వివరించారు. ఇలాంటి ఆపద సమయాల్లో తక్షణ సహాయం కోసం అందుబాటులో ఉన్న ముఖ్యమైన హెల్ప్‌లైన్ నంబర్లను రాజంపేట పట్టణ ఎస్.ఐ వెంకటేష్ గుర్తు చేశారు.


సున్నపురాళ్లపల్లెలో ప్రజలతో మాట్లాడుతున్న ఎస్సై వెంకటేష్

# గౌడన్నకు చేయూత ద్వారా 17 మంది విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు

**రాజంపేట, మే 31 ప్రభాతవార్త**
ఏడాది మార్చిలో వచ్చిన ఇంటర్మీడియట్, టెన్త్ ఫలితాలలో అత్యంత మార్కులు సాధించిన ఈడిగ విద్యార్థులకు గౌడన్నకు చేయూత కార్యక్రమం ద్వారా ప్రథమ, ద్వితీయ, తృతీయ తృతీయ నగదు బహుమతులతో పాటు ప్రతిభా పురస్కారాలను అందజేశారు. కడపలో జరిగిన కార్యక్రమంలో ప్రతిభ పురస్కారాల ఎంట్రీలకు వచ్చిన వివరాల ప్రకారం ఇటికల వెంకటరాకేష్ గౌడ్, ఇంటర్మీడియట్ 985 మార్కులు సాధించినందుకు గాను అభినందిస్తూ నగదు, మెమెంటో తో అందజేసి సత్కరించారు. గాడిదల జాహ్నవి గౌడ్ 984, శాబొలి గౌతమ్ గౌడ్ లు టెన్త్ లో 582 మార్కులు ఉత్తీర్ణులైనందుకు అభినందనలు పురస్కారం అందించారు.బుసినెని జయంతి గౌడ్ 580 మార్కులు, చింతామణి శివతేజ గౌడ్ 578 మార్కులు సాధించేందుకు నగదు, జ్ఞాపిక అంద చేశారు. ఈ సందర్భంగా చైర్మన్ మన్నెం రామమోహన్ మాట్లాడుతూ కలలు సాకారం చేసుకోవాలంటే అందుకు విద్య ఒక్కటే మార్గమని, ఉన్నత స్థాయికి చేరుకోవాలంటే అది విద్యతోనే సాధ్యమని ఇష్టపడి చదివి తల్లిదండ్రులు మీపై పెట్టుకున్న ఆశలను నెరవేర్చాలని కోరారు. ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులతో పాటు మొత్తం 17 మందికి మెమెం టోస్, నగదు పురస్కారాలు అందజేయడం జరిగిందన్నారు.ఈ కార్యక్రమంలో గౌడన్న చేయూత కార్యక్రమం వైస్ చైర్మన్ కంపరాజు కొండయ్య గౌడ్, కోఆర్డినేటర్ మలిశెట్టి ప్రసాద్ గౌడ్, కడప జిల్లా అధ్యక్షులు ఆదినారాయణ గౌడ్, మెంబర్షిప్ చైర్ పర్సన్ దొంతా వెంకట సురేష్ గౌడ్, సర్వీస్ చైర్ పర్సన్ బండారు రెడ్డి శేఖర్ గౌడ్, జాయింట్ సెక్రెటరీ బత్తుల మాచర్ల గౌడ్, ప్రొద్దుటూరు అధ్యక్షులు దొంతా రామయ్య గౌడ్, దొంతా వెంకటసుబ్బయ్య గౌడ్, తదితరులు పాల్గొన్నారు.


అవార్డులు అందుకున్న గౌడ విద్యార్థులు

# ఒక కుటుంబానికి ఒకే గ్యాస్ కనెక్షన్.. జూన్ 1 నుంచి కొత్త నిబంధనలు అమలు

**పీలేరు మే 31 ప్రభాతవార్త:**
ఒకే ఇంటిలో ఒకటి కన్నా ఎక్కువ గ్యాస్ కనెక్షన్లు ఉన్న కుటుంబాలకు కేంద్రం షాకిచ్చింది. పశ్చిమాసియా యుద్ధ సంక్షోభం, హుర్ముజ్ జలసంధి వద్ద ఏర్పడిన ప్రతిష్ఠంభనతో ఎల్పీజీ దిగుమతి గణనీయంగా తగ్గిపోయిన క్రమంలో గ్యాస్ వినియోగాన్ని నియంత్రించడానికి ఒక కుటుంబానికి ఒకటే గ్యాస్ కనెక్షన్ నిబంధన అమలుకు ఆదేశాలు జారీ చేసింది. ఈ నిబంధనలు జూన్ 1 నుంచి అమల్లోకి వస్తాయని ప్రకటించింది. ఒకే ఇంటిలో ఒకటి కన్నా ఎక్కువగా బహుళ గ్యాస్ కనెక్షన్లు ఉంటే అది చట్ట విరుద్ధమని పేర్కొన్నది. ఈ మేరకు కేంద్ర ప్రభుత్వ ఆయిల్ మార్కెటింగ్ సంస్థలైన ఇండియన్ ఆయిల్, హెచ్‌పీసీఎల్, భారత్ పెట్రోలియం గ్యాస్ వినియోగ దారులను ఉద్దేశించి ఉమ్మడి ప్రకటన చేశాయి. నూతన నిబంధనలను అనుసరించి వినియోగదారులు తమ వద్ద అదనంగా ఉన్న గ్యాస్ సిలిండర్లను వెంటనే అప్పగించాలని విజ్ఞప్తి చేశాయి. ఒక వంట గదితో ఉండే ఒక కుటుంబం (భర్త, భార్య, పెళ్లయిన పిల్లలు, తల్లిదండ్రులు)కు ఒక్క ఎల్పీజీ కనెక్షన్‌ను మాత్రమే అనుమతిస్తారు. అంతే కాకుండా అదనపు సిలిండర్లను కనుక కంపెనీలకు అప్పగించకపోతే వారి అసలు కనెక్షన్‌కు కూడా గ్యాస్ సరఫరా నిలిపివేస్తారు. సిలిండర్లను అప్పగించిన తర్వాతే సరఫరాను పునరుద్ధ రిస్తారు. అయితే అద నపు సిలిండర్‌ను తిరిగి అప్పగించిన తర్వాత వినియోగదారులు ఒక బ్యాకప్ సిలిండర్ కోసం డబుల్ బాటిల్ కనెక్షన్‌గా మార్చుకోవడాన్ని ఎంచుకోవచ్చు. ఒక వేళ విని యోగదారులు పీఎన్‌జీ కనెక్షన్‌ను కనుక పొందదలిస్తే తమ ఎల్పీజీ కనెక్షన్‌ను 30 రోజుల్లోగా అప్పగించాలి. ప్రత్యామ్నాయంగా వారు బదిలీ వోచర్‌ను అభ్యర్థించవచ్చు. దీని ద్వారా పీఎన్‌జీ అందుబాటులో లేని ప్రాంతంలో ఎల్పీజీ కనెక్షన్‌ను తిరిగి క్రియాశీలం చేయడం సాధ్యమవుతుంది. గ్యాస్ వినియోగాన్ని నియం త్రించడానికి, దుర్వినియోగాన్ని అరికట్టడానికి ఈ చర్యలు తీసుకుంటున్నట్టు కేంద్రం ప్రకటించింది.




# విశేష పూజలందుకొన్న గంగా భవానీ



ఆలయంలో భక్తుల రద్దీ పూజలందుకొంటున్న అమ్మవారు, హోమాధికార్యక్రమల్లో భక్తులు అధికారులు

**బోయకొండ(చౌడేపల్లి), మే 31 ప్రభాతవార్త**
శక్తిక్షేత్రం బోయకొండ గంగమ్మ ఆదివారం భక్తులతో విశేష పూజలందుకొంది. ఉదయం నుంచి సాయంత్రం వరకు అమ్మవారి క్యూలైన్లలో యాత్రీకుల రద్దీ కనిపించింది. కొండ దినాన్ని పురష్కరించుకొని ఆలయ అర్చకులు అమ్మవారికి ప్రత్యేకాభిషేకం, అలంకరణ నిర్వహించారు. రాష్ట్రంతోపాటు కర్ణాటక, తమిళనాడుల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. యాత్రీకులతో ఆలయ ప్రాంగణం గంగమ్మ నామస్మరణతో మార్మోగింది. ఆలయ ఇఓ, ఉపకమీషనర్ ఏకాంబరం, అధికార, అర్చక సిబ్బంది భక్తులకు సేవలందించారు.

**అలరించిన చండీహోమం :** పౌర్ణమిని పురష్కరించుకొని ఆలయంలో జరిగిన చండీహోమం భక్తులను అలరించింది. ఇఓ, ఉపకమీషనర్ ఏకాంబరం ఆధ్వర్యంలో మండపంలో వేద పండితుడు గోవర్ధనశర్మచే అమ్మవారి ఉత్సవ విగ్రహ వద్ద చండీహోమాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. గణపతిపూజ, పూర్ణాహుతి వంటి కార్యక్రమాలు జరిగాయి. హోమానికి భక్తుల నుంచి విశేష స్పందన లభించింది.

## ఆత్మహత్యా యత్నానికి పాల్పడిన రైతు మృతి

**మదనపల్లెక్రైం, మే 31 ప్రభాతవార్త.**
ఆత్మహత్యా యత్నానికి పాల్పడిన రైతు చికిత్స పొందుతూ మృతి చెందాడు. మదనపల్లె మండలం, మాలేపాడు పంచాయతీ, అవులపల్లెకు చెందిన రైతు వెంకటేష్ (39) అప్పులబాధతో శనివారం సాయంత్రం పొలంలో పురుగుల మందుతాగి ఆత్మహత్యా యత్నానికి పాల్పడిన విషయం తెలిసిందే. కుటుంబీకులు బాధితున్ని జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన వైద్యం కోసం ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ ఆదివారం తెల్లవారుజామున మృతి చెందాడు. కాగా వెంకటేష్ కు భార్య కాంతమ్మ, ఇద్దరు కుమారులు కుశాంత్, హర్షవర్ధన్ లు ఉన్నారు. రైతు మృతితో అతని భార్యాపిల్లలు అనాధలయ్యారు. తాలూకా పోలీసులు ఆస్పత్రికి చేరుకుని ఘటనపై ఆరా తీశారు. అప్పులబాధతో ఆత్మహత్య చేసుకున్నట్లు బాధిత కుటుంబ సభ్యులు చెప్పడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ కళావెంకట్రమణ తెలిపారు.

## రిటైర్డ్ ఉపాధ్యాయునికి సన్మానం



**పీలేరు మే 31 ప్రభాతవార్త:**
55 సంవత్సరాలు ఉద్యోగ బాధ్యతలు ఎటువంటి మచ్చ లేకుండా ప్రతి విద్యార్థి తమ పిల్లలు లాగే భావించి విద్యాబుద్ధులు అందించి ఎంతో మంది విద్యార్థులు ఉన్నత స్థితికి చేరుకునే విధంగా బోధన అందించిన ఉపాధ్యాయులు లెక్కల మాస్టర్ ప్రకాష్ స్వామి కి తోటి ఉపాధ్యాయులు ఖాన్ తో పాటు పలువురు ఆయనను ఘనంగా సన్మానించి సత్కరించారు .ఈ సందర్భంగా మాస్టర్ ప్రకాష్ సార్ మాట్లాడుతూ పదవిలో ఉన్న రిటైర్డ్ అయిన తమ వంతు విద్యార్థులకు ఉన్నత భావాలు కల్పించడమే ప్రాణం ఉన్నంతవరకు నా ధ్యేయమని ఆయన అన్నారు. అదేవిధంగా నా దగ్గర విద్యను అభ్యసించిన విద్యార్థులు ఎంతో క్రమశిక్షణగా చదువుతోపాటు సంస్కారం కూడా నేర్చుకున్నారని కొంతమంది విద్యార్థులు సాఫ్ట్ వేర్ ఇంజనీర్లుగా, డాక్టర్లుగా, లాయర్లుగా ఉద్యోగ బాధ్యతలు నిర్వహిస్తున్నారని అటువంటివారు నా శిష్యులుగా ఉండటం నా దగ్గర విద్యను అభ్యసించడం గర్వంగా ఉందని ఆయన అన్నారు. పీలేరు నియోజకవర్గంలోనే కాకుండా జిల్లాలో పలు మండలాలలో ఉపాధ్యాయుడిగా పనిచేయడం గర్వకారణంగా ఉందని మాస్టర్ అన్నారు ఈ కార్యక్రమంలో పలువురు ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

## మధురమైన జ్ఞాపకాలు ఎప్పటికీ స్వచ్ఛంగాను, కల్మషం లేకుండా ఉంటాయి

**గాలివీడు మే 31 ప్రభాతవార్త**
ఆ మధురమైన జ్ఞాపకాలు ఎప్పటికీ స్వచ్ఛంగాను, కల్మషం లేకుండా ఉంటాయని రాయచోటి పూర్వ విద్యార్థి పేర్కొన్నారు. ఆయన ఈరోజు అన్నమయ్య జిల్లా గాలివీడులోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన 1984 85వ సంవత్సరం ఎస్ఎస్సి బ్యాచ్ పూర్వ విద్యార్థులు మరియు ఉపాధ్యాయుల ఆత్మీయ సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఆయన ఈ సందర్భంగా మాట్లాడుతూ :ప్రియమైన బాల్య స్నేహితులకు వందనములు తెలుపుతూ కాలాంత రంలో మనమంతా ఎక్కడెక్కడో రకరకాల వృత్తులలో స్థిరపడినా, మన చిన్ననాటి గుర్తులు మరియు మధురమైన జ్ఞాపకాలు ఎప్పటికీ స్వచ్ఛంగాను, కల్మషం లేకుండా, పచ్చదనంగాను ఉంటాయన్నారు.ఆ అమాయకపు నవ్వులను, స్కూల్ రోజుల ముచ్చట్లను మరోసారి గుర్తుచేసుకుంటూ, మనమంతా ఒకచోట కలవడానికి కృషి చేసిన వెంకటేష్ (రిటైర్డ్ ఆర్మీ ), విజయ భాస్కర్ రెడ్డి టీచర్, చిన్న రెడ్డన్న, శివ, లక్ష్మీదేవి చేసిన కృషి ఎనలేనిదని ఆయన వారిని కొనియాడారు మన పాత స్నేహాన్ని మరోసారి నెమరువేసుకుంటూ, కాసేపు హాయిగా గడపడానికి మీరందరూ ఆత్మీయ సమ్మేళమునకు ప్రతి ఏటా తప్పకుండా రావాలని మనసారా కోరుకున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలోఉపాధ్యాయుడు సుబ్బరాయుడు మరియు 70 మంది విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.



## 1న ఛలో కలెక్టరేట్‌ను విజయవంతం చేద్ధాం : మిద్దింటి



**చౌడేపల్లి, మే 31 ప్రభాతవార్త**
జూన్ 1న అన్నమయ్య జిల్లా కేంద్రం మదనపల్లిలో నిర్వహించే ఛలో కలెక్టరేట్‌ను విజయవంతం చేద్దామని వైకాపా రాష్ట్ర యువజన ప్రధాన కార్యదర్శి మిద్దింటి కిషోర్‌బాబు పిలుపు నిచ్చారు. రాష్ట్ర మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపి పెద్దిరెడ్డి వెంకట మిథున్‌రెడ్డి, తంబళ్ళపల్లి ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి, రాష్ట్ర వైకాపా యువజన విభాగ అధ్యక్షుడు జక్కంపూడి రాజా ఆదేశాల మేరకు జరిగబోయే నిరసన కార్యక్రమంలో నిరుద్యోగ యవతీ, యువకులు పాల్గొనాలన్నారు. కూటమి ప్రభుత్వం దగా డిఎస్సీని పెట్టి నిరుద్యోగులను నట్టేటముంచిందన్నారు. ప్రభుత్వం చేపట్టిన డిఎస్సీ అక్రమాలపై సిట్టింగ్ జడ్జి, సిబిఐతో విచారణ జరిపించాలన్నారు. అవినీతి అక్రమాలకు బాధ్యత వహిస్తూ విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ రాజీనామా చేయాలని డిమాండ్ చేసారు. జిల్లాలోని నలుమూలల నుంచి అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలన్నారు.

## ఆలరించిన ధుర్యోదన వధ



**పీలేరు , మే 31 ప్రభాతవార్త:**
స్థానిక ఆర్టీసీ బస్టాండ్ ప్రాంగణంలో నిర్వహిస్తున్న మహాభారత యజ్ఞంలో భాగంగా ఆదివారం సాయంత్రం నిర్వ హించిన ధుర్యోధన వధ కార్యక్రమం భక్తులను అలరించింది. 18 రోజులు పాటు జరిగిన మహాభారత యజ్ఞం దుర్యోదన వధ, అగ్నిగుండం ప్రవేశం, ధర్మరాజు పట్టాభిషేకంతో ముగిసింది. ఆదివారం సాయంత్రం మహాభారత యజ్ఞం వద్ద ధుర్యోధుని ప్రతిమ రూపొందించి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ధుర్యోదన, భీముని వేషదారులు ఆలపించిన పద్యాలు ఆకట్టుకున్నాయి. యుద్ధ ఘట్టం రక్తి కట్టించింది. అలాగే మధ్యాహ్నం భాగవతారిణి స్వర్ణలత కురుక్షేత్రం, ధుర్యోధన ఘట్టంపై హరికథాగానం చేశారు. రాత్రి భక్తుల కాలక్షేపానికి సాసవుల చిన్నమ్మకథ నాటకం ప్రదర్శించారు.

## జాతీయ స్థాయిలో కళాశాలకు త్రిబుల్ .ఎ. రేటింగ్.

**కురబలకోట మే 31 ప్రభాతవార్త.**
కురబలకోట మండలం అంగళ్లు గ్రామానికి సమీపంలోని మీట్స్ ఇంజనీరింగ్ కళాశాలకు జాతీయస్థాయిలో త్రిబుల్ ఎ రేటింగ్ లభించింది ని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ పి రామా నాదన్ తెలిపారు. జాతీయస్థాయిలో ఎన్. పీ.టీ.ఈ.ఎల్ వారు ఆన్లైన్లో జనవరి ఏప్రిల్ 20 26 సెషన్స్‌లో నిర్వహించిన పరీక్షలలో కళాశాల విద్యా ర్థులు , అధ్యాపకులు మొత్తం 8758 మంది సర్టిఫికెట్ కోర్సుక్ హాజరు కాగా ఇందులో ఇందులో 7484 మంది ప్రతిభ కనబరిచారు. దీంతో టాప్ 20 కళాశాలకు జాతీయ స్థాయిలో పదవ ర్యాంకు, రాష్టస్థాయిలో ఒకటవ ర్యాంకు లభించినట్లు ఆయన తెలిపారు. విద్యార్థులు అధ్యాపకుల లను యూనివర్సిటీ ఛాన్సర్ ఎన్ విజయ భాస్కర్ చౌదరి., ఈ డి కీర్తి నాదెళ్ల , ప్రో ఛాన్సులర్ ఎన్ ద్వారకనాథ్ లు అభినందించారు.

## ఎన్టీఆర్ భరోసా సామజిక పెన్షన్ల పంపిణీలో నాయకులు అందరూ పాల్గొనాలి



**చిన్నమండెం మే 31 ప్రబాత వార్త:**
మండల టీడీపీ నాయకులు, కార్యకర్తలు , తెలుగుదేశం పార్టీ ఆదేశాలు మేరకు, మంత్రివర్యులు మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి సూచనలు మేరకు ఎన్టీఆర్ పింఛన్ కార్యక్రమంలో అందరు పాల్గొనాలని తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షులు మూగి రెడ్డెప్ప పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జూన్ 1వ తేదీన జరిగే పెన్షన్ల పంపిణీ కార్యక్రమంలో నాయకులు అందరూ సచివాలయ సిబ్బందితో కలిసి మండలం లోని 13గ్రామాల టీడీపీ నాయకులు కార్యకర్తలు మరియు క్లస్టర్ ఇంచార్జి లు యూనిట్ ఇంచార్జి లు బూత్ కమిటీ వాల్లు గ్రామ కమిటీల నాయకులు మండల కమిటీ నాయకులు, మండల నాయకులు కలిసి అన్ని ఏరియాలలో కవర్ అయ్యే విధంగా లబ్ధిదారులకు పెన్షన్లను పంపిణీ చేసి ఫొటోస్ మై టీడీపీ అప్ లో అప్లోడ్ చెయ్యాలని కోరారు.

## ఘనంగా సూపర్ స్టార్ కృష్ణ 84వ జయంతి వేడుకలు



**పీలేరు, మే 31 ప్రభాతవార్త :**
తెలుగు సినీ పరిశ్రమలో నటశేఖరుడిగా, సూపర్ స్టార్‌గా, నిర్మాతగా, దర్శకుడిగా తనకంటూ ప్రత్యేక గుర్తింపు సంపాదించుకున్న మహానటుడు, మాజీ ఎంపీ ఘట్టమనేని కృష్ణ 84వ జయంతి వేడుకలను అభిమానుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఆదివారం ఉదయం పీలేరు ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో జరిగిన ఈ కార్యక్రమంలో కృష్ణ అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని తమ అభిమాన నటుడికి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా కృష్ణ వీరాభిమాని పసుపులేటి వెంకటరమణ ఆధ్వర్యంలో కృష్ణ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం బస్టాండ్‌లోని ప్రయాణికులకు, ప్రజలకు మిఠాయిలు పంపిణీ చేసి జయంతి వేడుకలను ఆనందోత్సాహాల మధ్య జరుపుకున్నారు. నటుడిగానే కాకుండా 1989లో ఏలూరు పార్లమెంట్ నియోజకవర్గం నుంచి లోక్‌సభకు ఎన్నికై ప్రజాసేవలోనూ తనదైన ముద్ర వేశారని పేర్కొన్నారు. కళాకారుడిగా, ప్రజాప్రతినిధిగా కృష్ణ అందించిన సేవలు తరతరాలకు ఆదర్శంగా నిలుస్తాయని అన్నారు. ఈ కార్యక్రమంలో కృష్ణ అభిమానులు పసుపులేటి వెంకటరమణ, ఆర్టిస్ట్ రాము, శ్రీనివాసులు శాస్త్రి, ఎం.డి. షఫీ, ఆర్టీసీ వలి, ఖాజాపీర్, కార్గో ఆటో బాషా, జావీద్, సురేంద్ర తదితరులు పాల్గొన్నారు.

## నిలబడి ఉన్న ట్రాక్టర్ కారు ఢీకొని నలుగురికి గాయాలు




**లక్కిరెడ్డిపల్లి మే 31 ప్రభాతవార్త**
మండలంలోని కోణం పేట వద్ద ఆదివారము వేంపల్లి వైపు నుంచి వస్తున్న కారు ముందుగాల పంచరై కోనంపేటలో రోడ్డుపై నిలబదిన ఉన్న టాక్టర్ తొట్టికి కారు ఢీకొని నలుగురికి తీవ్ర గాయాలయ్యాయి స్థానికుల కథనం మేరకు వివరాలు ఎలా ఉన్నాయి అనంతపురం నుంచి రాయచోటికి వెళుతున్న డివైసర్ కారు కోరంపేట సమీపం వచ్చేసరికి ముందుగాను పంచరెయ్యి నిలిచి ఉన్న ట్రాక్టర్లు ఢీకొనడంతో డ్రైవర్‌కు కారులో ఉన్న నలుగురికి స్వల్ప గాయాలయాన్ని స్థానికులు తెలిపారు ఈ మేరకు కారు ముందు భాగము చేయండి కారులో ఉన్న వారికి పెద్ద ప్రమాదం లేకుండా స్వల్ప గాయాలయ్యాయని స్థానికులు తెలిపారు ఈ మేరకు క్షతగాత్రులను లక్కిరెడ్డిపల్లి ప్రభుత్వ తరలించి చికిత్సలు నిర్వహించారు ఈ మేరకు పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని పరిశీలించారు.

## నాగులమ్మ ఆలయంలో పౌర్ణమి పూజలు


విశేషాలంకరణలో నాగులమ్మ

**చౌడేపల్లి, మే 31 ప్రభాతవార్త**
పట్టణంలోని వైఎస్సార్ కాలనీలో నాగులమ్మ ఆలయంలో పౌర్ణమి పూజలను సాంప్రదాయ పద్ధతిలో నిర్వహించారు. పరికిదొన మార్గంలో గల ఆలయంలో ఉదయాన్నే అర్చకుల ఆధ్వర్యంలో అమ్మవారికి విశేష అభిషేకం, అలంకరణగావించారు. వివిధ రకాల పుష్పాలతో ఆలయాన్ని సర్వాంగ సుందరంగా అలంకరించారు. పలు ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలి రావడంతో ఆ ప్రాంతం భక్త జన సంద్రమైంది. నిర్వాహకులు వారికి పవిత్ర తీర్థ ప్రసాదాలందించారు.

## అనంతపురం గంగమ్మ తల్లి కరుణించి కాపాడవమ్మా అంటూ అమ్మవారికి భోణాలు



**లక్కీరెడ్డిపల్లి మే 31 ప్రభాత వార్త**
శ్రీ శ్రీ అనంతపురం గంగమ్మ తల్లి కరుణించి కాపాడవమ్మా అంటూ అమ్మవారికి వేలాది మంది భక్తులు ఆదివారం భోణాలు సమర్పించి, తలనీలాలు అర్పించి మొక్కులు తీర్చుకున్నారు. గంగమ్మ దేవత అమ్మవారికి పూజారులు అభిషేక పూజలు నిర్వహించి, ప్రత్యేక అలంకరణ చేసి భక్తులకు అమ్మవారి దర్శనాన్ని కల్పించ్చారు. భక్తులు కోరిన కోర్కెలు తీర్చి కొంగుబంగారంగా విరాజిల్లుతున్న అనంతపురం గంగమ్మకు సంతానంను ప్రసాదించాలి అంటూ మహిళలు అమ్మ వారి ఆలయంలో ఒరపడి మొక్కులు చెల్లించ్చారు. ఆలయ కమిటీ చైర్మన్ వెంకటేశ్వర్లు, ఆలయ పూజారులు గంగయ్య, రెడ్డిశేఖర్, చంద్ర,ఆలయ ప్రత్యేక అధికారి శ్రీనివాసులు, అధికారులు, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

# హామీలను కూటమి ప్రభుత్వం అమలు చేయాలి

**ఎడ్యుకేషన్ మే 31 ప్రభాతవార్త :**
కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీల అమలులో కూటమి ప్రభుత్వం మాట తప్పిందని యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి బి.లక్ష్మీ మ్రరాజా విమర్శించారు. ప్రతి పక్షంలో ఉన్నప్పుడు 12వ పీఆర్సీ అమలు చేస్తామని, సీపీఎస్ రద్దు చేస్తామ ని, ఆర్థిక బకాయిలు చెల్లిస్తామని ఇచ్చిన హామీలను అధికారంలోకి వచ్చి రెం డేళ్లయినా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని మండిపడ్డారు.పీఆర్సీ గడువు ము గిసి మూడేళ్లయినా కమిషన్ వేయకపోవడంతో రిటైర్ అవుతున్న ఉద్యోగులు నష్టపోతున్నారు.

**రూ. 30 వేల కోట్ల బకాయిలు:**

కేవలం రూ. 9,500 కోట్లు ఇచ్చి మొత్తం చెల్లించినట్లు గొప్పలు చెప్పుకుం టున్నారని, ఇంకా రూ. 30 వేల కోట్లకు పైగా బకాయిలు ఉన్నాయని పేర్కొ న్నారు. ఉద్యోగులకు రావాల్సిన 4 డీఏలు, మూడేళ్లుగా సరెండర్ లీవ్ బకా యిలు పెండింగ్‌లోనే పెట్టారన్నారు. ప్రభుత్వం ఇచ్చిన హెల్త్ కార్డులు ఆ



సుపత్రుల్లో చెల్లడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి ఆర్థిక బకాయిలపై రోడ్ మ్యాప్ ప్రకటించకపోతే.. జూన్ మాసంలో ఫ్యాప్టో ఆధ్వర్యంలో ఛలో సెక్రటేరియట్‌ఖి నిర్వహిస్తామని లక్ష్మీరాజా హెచ్చ రించారు. ఈ సమావేశంలో యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మాదన విజయకుమార్, పాలెం మహేష్ బాబు తదితరులు పాల్గొన్నారు.

## గండి వీరాంజనేయ స్వామి దేవస్థానం ఈఓగా విశ్వనాథ్ నియామకం

**వేంపల్లి మే 31 ప్రభాతవార్త**



గండి వీరాంజనేయ స్వామి దేవస్థానం ఈవోగా విశ్వనాథ్ నియామకమయ్యారు.అనంతపురం కు చెందిన ఈయన అన్నమయ్య జిల్లా దేవాదాయ ధర్మాదాయ శాఖ సహాయ కమిషనర్ గా పనిచేస్తున్నారు.. ఇక్కడ పనిచేస్తున్న కర్నూలు డీసీ గురు ప్రసాద్ ఆదివారం పదవి విరమణ చేయడంతో ఆయన స్థానంలో ఇన్చార్జి ఏసీగా ఈయనకు అదనపు బాధ్యతలు అప్పగించారు.

## గోనుగుంట బలిజ సేవా సంఘ నూతన కార్యవర్గం ఎన్నిక



నూతనంగా ఎన్నికైన గోనుగుంట బలిజ సేవా సంఘం

**బద్వేలు, మే 31, ప్రభాతవార్త**
గోనుగుంట బలిజ సేవా సంఘ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకు న్నారు. సంఘ అధ్యక్షులుగా బద్వేల్‌కు చెందిన మానుగుంట రవిశంకర్, ఉపా ధ్యక్షులుగా పామూరుకు చెందిన శ్రీ పోతరాజు వసంతరావు, ప్రధాన కార్య దర్శిగా నెల్లూరుకు చెందిన దర్శి వెంకటేశ్వరరావు, సంయుక్త కార్యదర్శిగా లిం గసముద్రానికి చెందిన వాకా మాల్యాద్రి, కోశాధికారిగా చుంచులూరుకు చెందిన కలిశెట్టి రాజేంద్ర కుమార్ ఎన్నికయ్యారు. కార్యవర్గ సభ్యులుగా తిరుపతికి చెందిన శ్రీ అంగులూరి నరసింహారావు, లింగసముద్రానికి చెందిన బింకం నా గేంద్ర, కదిరికి చెందిన మానుగుంట విష్ణు కుమార్, లింగసముద్రానికి చెందిన డాక్టర్ నాయుడు మాల్యాద్రి ఎన్నికయ్యారు. మహిళా కార్యదర్శిగా నెల్లూరుకు చెందిన భట్టరుశెట్టి మాధవి బాధ్యతలు చేపట్టనున్నారు. ఈ సందర్భంగా నూ తన కార్యవర్గ సభ్యులు సంఘ అభివృద్ధికి కృషి చేస్తూ బలిజ సామాజిక వర్గ సంక్షేమం కోసం పనిచేస్తామని తెలిపారు.

## రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ - సీఐ



**ముద్దనూరు, మే 31, ప్రభాతవార్త:**
కడప జిల్లా పోలీసు అధికారి (ఎస్పీ) నచ్చికేత్ విశ్వనాథ్ ఆదేశాల మేరకు స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఆదివారం రౌడీషీటర్లు, అనుమానిత వ్యక్తులను పి లిపించి పోలీసులు ప్రత్యేక కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ నాగేష్‌బాబు మాట్లాడుతూ శాంతిభద్రతలకు విఘాతం కలిగించే ఎలాంటి కా ర్యకలాపాలకు పాల్పడరాదని, వివాదాలు, గొడవలు, చట్టవిరుద్ధ చర్యలకు దూరంగా ఉండాలని సూచించారు. ప్రజల ప్రశాంత జీవనానికి భంగం కలిగిం చే సంఘటనల్లో పాల్గొంటే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. అలాగే రౌడీషీటర్లు తమ కుటుంబ సభ్యులు, ముఖ్యంగా తమ పిల్లల భవిష్యత్తు గు రించి ఆలోచించి సత్ప్రవర్తనతో మెలగాలని, సమాజంలో గౌరవప్రదమైన జీవి తం గడపాలని సూచించారు. ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా ప్రవర్తిస్తూ మంచి నడవడికతో సమాజంలో మెలగాలని, చట్టాలను గౌరవించి తప్పని సరిగా పాటించాలని తెలిపారు. శాంతి భద్రతల పరిరక్షణకు ప్రజలందరూ పో లీసులకు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఎస్ఐ రమేష్‌తో పా టు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# ఘనంగా ముగిసిన వేద మైండ్స్ సమ్మర్ క్యాంప్

### భూమిరెడ్డి ఉమాదేవి చేతుల మీదుగా సర్టిఫికెట్ల ప్రధానం

**పులివెందుల, మే 31 , ప్రభాతవార్త :**
విద్యార్థుల మేధో వికాసం, వ్యక్తిత్వ అభివృద్ధి లక్ష్యంగా నిర్వహించిన వేద మైండ్స్ సమ్మర్ క్యాంప్ ముగింపు కార్యక్రమం ఆదివారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా క్యాంప్‌లో పాల్గొన్న విద్యార్థులకు సర్టిఫికెట్లు ప్రదానం చేశా రు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన భూమిరెడ్డి ఉమాదేవి విద్యా ర్థులకు సర్టిఫికెట్లు అందజేసి అభినందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లా డుతూ అబాకస్, వేదిక్ మ్యాథ్స్, వ్యక్తిత్వ వికాస శిక్షణతో పాటు విద్యా విహార యాత్రలు విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి ఎంతో దోహదపడతాయని పేర్కొ న్నారు. ఇటువంటి కార్యక్రమాలు విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించి భవిష్యత్‌లో ఉన్నత లక్ష్యాలను సాధించేందుకు మార్గదర్శకంగా నిలుస్తాయని తెలిపారు. గౌరవ అతిథులుగా పాల్గొన్న శివారెడ్డి చారిటబుల్ ట్రస్ట్ మేనేజింగ్ డైరెక్టర్ కటికరెడ్డి అనసూయ ,డి. అంకాలమ్మలు విద్యార్థులను అభినందించి, క్యాంప్ ద్వారా పొందిన జ్ఞానం మరియు నైపుణ్యాలను విద్యాభ్యాసంలో సద్వి నియోగం చేసుకోవాలని సూచించారు. క్యాంప్‌ను విజయవంతంగా నిర్వహిం చిన చిన్నయ్య, బాలశివ, కె. జవహర్ రెడ్డిలను అతిథులు ప్రత్యేకంగా అభినం దించారు. విద్యార్థుల ప్రతిభను వెలికితీసే విధంగా వివిధ శిక్షణా కార్యక్రమా లను సమర్థవంతంగా నిర్వ హించారని ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో వి ద్యార్థులు, తల్లిదండ్రులు, నిర్వా హకులు పెద్ద సంఖ్యలో పాల్గొనడం పట్ల హర్షం వ్యక్తం చేశారు.



భూమిరెడ్డి ఉమాదేవి చేతుల మీదుగా సర్టిఫికెట్లు తీసుకుంటున్న విద్యార్థులు

## వార్తకు స్పందన

**కలసపాడు, మే 31 ప్రభాతవార్త:**
రెవెన్యూ డివిజినల్ అధికారి ఆదేశాల మేరకు కలసపాడు టౌన్ లో పెట్రోల్ బంకులను డిప్యూటీ తహసిల్దార్ మోహన్ రాజు , హెడ్ కానిస్టేబుల్ శంకర్ , వీఆర్ఏ గుర్రప్ప లు తనిఖీ చేశారు. ఈ తనిఖీల్లో దాదన కృష్ణారెడ్డి దుకాణం నందు 4 లీటర్లు , దూదేకుల దస్తగిరమ్మ దుకాణం నందు 7 లీటర్లు , జక్క సుధాకర్ దుకాణం నందు 5 లీటర్లు మొత్తం 16 లీటర్లు పెట్రోలు ను స్వాధీనం చేసుకున్నారు.

## గిన్నిస్ వరల్డ్ రికార్డ్ సాధించిన మైదుకూరు విద్యార్థులు

### హల్లెల్ మ్యూజిక్ స్కూల్ గిన్నిస్ వరల్డ్ రికార్డ్,

**మైదుకూరు, మే 31, ప్రభాతవార్త:**
హైదరాబాదులో గిన్నిస్ వరల్డ్ రికార్డ్ గచ్చిబౌలి విక్టరీ ఆడిటోరియం లో ప్రతినిధుల ఆధ్వర్యంలో జరిగినది.ఈ బృహత్తర కార్యక్రమంలో 22 దేశాల నుండి 2,000 మంది కీబోర్డ్ వాయిద్యకారులు గంటపాటు కీబోర్డ్ ఆగకుండా వాయిస్తూ పాల్గొన్నారు.అందులో కీబోర్డ్ వాయించుటలో ప్రతిభను చూపిన 777 మంది విద్యార్థులు ఎంపికయ్యారు. ఈ ప్రతిభావంతులకు ఈ స్కూలు వ్యవస్థాపకులు అగస్టిన్ దండింగి స్వయంగా సర్టిఫికేట్లు అందజేసి అభి నందించారు.ఈ కార్యక్రమంలో మైదుకూరుకు చెందిన సెయింట్ జాన్స్ ఇం గ్లీష్ మీడియం హై స్కూల్ డైరెక్టర్ రేవ.డా.వై.సుందరేషన్ కుమార్తెలు, వై.గ్రేటి గాస్పల్ క్రిస్టి గాస్పల్ కుమారుడు జాన్ థియోఫిలస్ పాల్గొని, గిన్నిస్ వరల్డ్ రికార్డులో చోటు సంపాదించారు. వీరు మైదుకూరు పట్టణం లో సె యింట్ జాన్స్ ఇంగ్లీష్ మీడియం హై స్కూల్ నందు10వ తరగతి మరియు 6 వ తరగతి చదువుచున్నారు. ఈ సందర్భంగా స్కూల్ యాజమాన్యం అభి నందించారు.



# పొగ తాగడం హానికరం




**ప్రొద్దుటూరు అర్బన్ మే 31 ప్రభాతవార్త**
సర్వో దయ ఇంటిగ్రేటెడ్ రూరల్ డెవలప్ మెంట్ సొసైటి ఆధ్వర్యంలో ప్రపంచ పొగాకు వ్యతిరేకదినం పురస్కరించు కొని ఆదివారం అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమం లో మాజీ కౌన్సిలర్ వరికూటి ఓబుళరెడ్డి మాట్లాడుతూ పొగత్రాగడం ఆరోగ్యా నికి హానికరం అన్నారు. వైద్య ధికారి డాక్టర్ బద్వేలి శివ ప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ పొగాకు వినియోగము మరియు దాని ఉత్పత్తులు కు సంబంధించి న ప్రమాదాలను గురించి మరి యు కుటుంబము సమాజము పర్యావరణం పై దాని దుష్పరిణామం గురించి అవగాహన కల్పించారు. ఖైని, గుట్కా, సిగరెట్లు, చుట్టలు, బీడీలు, తీసుకోవ డం వలన క్యాన్సర్ వచ్చే ప్రమాదం ఉంది కావున వాడకూడదని తెలియజే శారు. అనంతరం పురవీధుల్లో ర్యాలీ నిర్వహించారు.ఈ కార్యక్రమంలో సిర్డ్ సొసైటీ అధ్యక్షులు ఎంవి సుబ్బారెడ్డి సభ్యులు వి. చెన్నమ్మ, గంగభవాని, రమణమ్మ, నరసింహరెడ్డి, అల్లాబకష్ పాల్గొన్నారు.

# రోడ్లు, మౌలిక సదుపాయాల అభివృద్ధికి చర్యలు చేపట్టాలి

**బద్వేలు అర్బన్, మే 31, ప్రభాతవార్త**
బద్వేల్ పట్టణంలో రోడ్లు, డ్రైనేజీలు, తాగునీరు, పారిశుధ్యం వంటి మౌలిక సదుపాయాల అభివృద్ధికి ప్రభుత్వం కేటాయించిన నిధులను సమర్థవంతంగా వినియోగించాలని బద్వేల్ పట్టణ అభివృద్ధి సొసైటీ నాయకులు కోరారు. ఆది వారం ఆర్‌టీసీ మజ్దూర్ యూనియన్ కార్యాలయంలో నిర్వహించిన సొసైటీ కార్యవర్గ సమావేశంలో ఈ మేరకు పలు తీర్మానాలు చేశారు. సొసైటీ అధ్యక్షు డు నానబాల వెంకటేశ్వర్లు మాట్లాడుతూ మున్సిపాలిటీ ఏర్పడి 15 సంవ త్సరాలు పూర్తయినప్పటికీ పట్టణంలోని అనేక ప్రాంతాల్లో ఇప్పటికీ మట్టి రోడ్లే ఉండడం విచారకరమన్నారు. పట్టణ అభివృద్ధి, సుందరీకరణ కోసం ప్రభుత్వం సుమారు రూ.200 కోట్ల నిధులు కేటాయించిన నేపథ్యంలో రాజకీయాలకు అతీతంగా అన్ని వర్గాల నాయకులు సమన్వయంతో పనిచేసి నిధులు దుర్విని యోగం కాకుండా ప్రజలకు ఉపయోగపడే విధంగా ఖర్చు చేయాలని కోరారు. పట్టణంలోని రోడ్ల ఆక్రమణలను తొలగించి నాణ్యమైన రోడ్లు, డ్రైనేజీలు, వీధి దీపాలు, పారిశుధ్య, తాగునీటి సదుపాయాలు కల్పించాలని సూచించారు. అ లాగే నాగులచెరువును పరిశుభ్రపరచి సుందరీకరణ చేపట్టి మధ్యలో గౌతమ బుద్ధుని విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. సిద్ధవటం రోడ్డులో ప్రజలకు ఇబ్బందులు కలిగిస్తున్న చికెన్, మటన్ దుకాణాలను ఇతర ప్రాం తాలకు తరలించాలని కోరారు. ప్రధాన కార్యదర్శి బద్వేలు గురుమూర్తి మాట్లా డుతూ సిద్ధవటం, మైదుకూరు, నెల్లూరు రోడ్లలోని ఆక్రమణలు, విద్యుత్ స్తం భాలను తొలగించి ఆర్అండ్‌బీ భూమి వరకు రోడ్లను విస్తరించాలని, తద్వారా ట్రాఫిక్ సమస్యలు, ప్రమాదాలను తగ్గించవచ్చని అన్నారు. అదేవిధంగా ప్రభు



త్వ ఆసుపత్రిలో వైద్యులు, సిబ్బంది కొరతను నివారించి ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని, పట్టణంలోని బీసీ బాలుర సంక్షేమ వసతిగృహం శిథిలావస్థలో ఉండటంతో కొత్త భవన నిర్మాణం చేపట్టి పేద విద్యార్థులకు మె రుగైన వసతులు కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు. అనంతరం మున్సిపాలిటీ పరిధిలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో పదో తరగతి పరీక్షల్లో అత్యధిక మా ర్కులు సాధించిన 15 మంది విద్యార్థులకు నిర్వహించిన ప్రోత్సాహక బహు మతుల కార్యక్రమానికి సహకరించిన సబ్ రిజిస్ట్రార్ సాకె ఈశ్వరయ్య, అడ్వ కేట్ మురళీకృష్ణ, ఉపాధ్యాయుడు పి.వి. రమణయ్యలను దుశ్శాలువాలు, జ్ఞాపికలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో సొసైటీ కోశాధికారి పి. శ్రీనివా సులు రెడ్డి, ఉపాధ్యక్షులు ఎస్.ఎ. సత్తార్, ,ట్రావెల్స్ రసూల్, మస్తానయ్య, నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

## విద్యతో ఉన్నత శిఖరాలు అధిరోహించవచ్చు

### రజక విద్యార్థుల ప్రతిభకు సన్మానం..

### నగదు బహుమతుల ప్రదానం



**ప్రొద్దుటూరు, మే 31 ప్రభాతవార్త**
విద్య ద్వారానే జీవితంలో ఉన్నత స్థానాలను చేరుకోవచ్చని వక్తలు పేర్కొ న్నారు. స్థానిక శ్రీ చక్ర ఫంక్షన్ హాల్‌లో ప్రొద్దుటూరు రజక వెల్ఫేర్ అసోసియే షన్ ఆధ్వర్యంలో తొలిసారిగా నిర్వహించిన 10వ తరగతి, ఇంటర్మీడియట్‌లో ప్రతిభ కనబరిచిన రజక విద్యార్థులను ఘనంగా సన్మానించి నగదు బహుమ తులు అందజేశారు. 10వ తరగతిలో ప్రథమ బహుమతిగా రూ.10,000, ద్వితీయ రూ.8,000, తృతీయ రూ.6,000తో పాటు 10 మంది విద్యా ర్థులకు రూ.5,000 చొప్పున కన్సోలేషన్ బహుమతులు అందజేశారు. ఇంట ర్మీడియట్ విద్యార్థులకు కూడా ఇదే తరహాలో ప్రోత్సాహక బహుమతులు అం దించారు. ముఖ్య అతిథులు న్యాయమూర్తి శివశంకర్, లెక్చరర్ కృష్ణుడు మా ట్లాడుతూ కష్టపడి చదివితే ఏ రంగంలోనైనా విజయాలు సాధించవచ్చని సూ చించారు. అసోసియేషన్ నాయకులు విద్యార్థుల ప్రోత్సాహానికి ఈ కార్యక్రమా న్ని కొనసాగిస్తామని తెలిపారు. తల్లిదండ్రులను కోల్పోయిన చిన్నారికి సుకన్య సమృద్ధి యోజన ఖాతా ద్వారా ఆర్థిక భరోసా కల్పించారు. కార్యక్రమం ఉత్సా హభరిత వాతావరణంలో ముగిసింది.

# ఘనంగా పోలేరమ్మ జాతర



**కలసపాడు, మే 31 ప్రభాతవార్త:**
ముదిరెడ్డిపల్లి గ్రామ పోలేరమ్మ నూతన గుడి ప్రతిష్ట అనంతరం జరు గుతున్న 21వ రోజుల జాతర కార్యక్రమంలో ఆదివారం గ్రామానికి చెందిన దాదన నడిపి గురివిరెడ్డి, దాదన గురువిరెడ్డి, దాదన సుబ్బరా యుడుల ఆహ్వానం మేరకు ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి, బద్వేల్ ఎమ్మెల్యే డాక్టర్ సుధమ్మ , నియోజకవర్గ యువ నాయకుడు, రాష్ట్ర విద్యార్థి విభా గం ప్రధాన కార్యదర్శి దేవసాని ఆదిత్య రెడ్డి, నియోజకవర్గ బూత్ కన్వీనర్లు సమన్వయకర్త కల్లూరి రమణారెడ్డి మండల నాయకులతో కలిసి కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం పోలేరమ్మ అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొని, గ్రామస్తులు ఏర్పాటు చేసిన తేనేటి విందులో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారికి శాలువాలు, పూ లమాలతో ఘనంగా సత్కరించారు.

## ఇరుగులమ్మ తల్లికి ప్రత్యేక పూజలు

కు 400 మందికి అన్నప్రసాదాలు సమకూర్చారు. ఈ కార్యక్రమంలో టిడిపి జాతీయ ఉపాధ్యక్షులు బాలిశెట్టి హరి ప్రసాద్, రాజంపేట జనసేన పార్టీ పార్లమెంట్ సమన్వయ కర్త అతి కారి కృష్ణ, బలిజ సంఘం జిల్లా అధ్యక్షులు గోపిశెట్టి నాగరాజు, రాష్ట్ర పంచాయతీరాజ్ ఛాంబర్ ఆర్గనై జింగ్ సెక్రటరీ కుప్పాల వెంకటసుబ్బయ్య, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ ప్రతినిధి దేరంగుల శ్రీకాంత్, ఒంటిమిట్ట సింగిల్ విండో అ ధ్యక్షులు జయకృష్ణ, రిటైర్డ్ ప్రిన్సిపల్ బండారు రాజగోపాలయ్య, టిడిపి మండల అధ్యక్షులు రాజశేఖర్, క్లస్టర్ ఇంచార్జ్ రాజా నాయుడు, వ్యవ సాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ సంజీవరెడ్డి, పార్లమెంట్ ఉపా ధ్యక్షులు నాగ మునిరెడ్డి, మాజీ ఎంపీపీ, నరసింహారెడ్డి, మాజీ టిడిపి మండల కన్వీనర్, మామిడి వెంకట సుబ్బారెడ్డి సింగిల్ విండో డైరెక్టర్ బాలిరెడ్డి, రైతు విభాగపు కన్వీనర్, మల్లు వెంకట సుబ్బారెడ్డి, మాజీ స ర్పంచ్ ఓబులయ్య, అక్కిశెట్టి మనీ ఏ నాగరాజు పాల్గొన్నారు.

### మంగళగిరి టిడిపి నాయకుడు, ఎంఎంసి చైర్మన్ కిరణ్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన బద్వేల్ మార్కెట్ కమిటీ పాలకవర్గం



**బద్వేల్ అర్బన్, మే 31 (ప్రభాతవార్త):**
బద్వేల్ వ్యవసాయ మార్కెట్ యార్డ్ నందు ఆదివారం ఒక ప్రాముఖ్యమైన భేటీ జరిగింది. రాష్ట్ర తెలుగు యువత ఆర్గనైజింగ్ సెక్రటరీ, మంగళగిరి టిడిపి ముఖ్య నాయకుడు, అలాగే అక్కడి వ్యవసాయ మార్కెట్ కమిటీ ( ఏఎంసి ) చైర్మన్ అయిన కిరణ్‌ను బద్వేల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ నా రిశెట్టి సుప్రజ, నాగేంద్ర దంపతులు మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా బద్వేల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ అభివృద్ధి, భవిష్యత్తు కార్యా చరణ, మరియు రైతులకు అందించాల్సిన సేవలపై వారు పలు విషయాలను చర్చించారు. మంగళగిరి ఎఎంసి చైర్మన్ కిరణ్‌కు వారు శాలువా కప్పి, పుష్ప గుచ్చం అందించి స్వామి వారి ప్రతిమను అందజేసి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ రైతు సంక్షేమమే ధ్యేయంగా కూ టమి ప్రభుత్వం పనిచేస్తోందని, మార్కెట్ యార్డులను మరింత బలోపేతం చేసేందుకు పాలకవర్గాలు నిరంతరం శ్రమించాలని ఆకాంక్షించారు. ఈ కా ర్యక్రమంలో బద్వేల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ సుబ్బారావుతో పాటు మార్కెట్ కమిటీకి చెందిన పలువురు ముఖ్య నాయకులు, డైరెక్టర్లు మరియు టిడిపి కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## పవిత్ర జలంతో జ్యోతి సిద్దవటేశ్వర స్వామికి అభిషేకం

**సిద్దవటం మే 31 ప్రభాతవార్త**



మానస సరోవరం (కైలాసం) యాత్రను పరమశివుని ఆశీర్వాదంతో దిగ్విజయంగా ముగించికొని ఆ పవిత్ర జలాన్ని తీసుకొని వచ్చి జ్యోతి సిద్దవటేశ్వర స్వామికి అభిషేకం చేసినట్లు పిన్నపురెడ్డి రాజా భార్గవ్ రెడ్డి, జ్యోతి శివారెడ్డి లు తెలిపారు. జ్యోతి సిద్దవటేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం వారు మాట్లాడుతూ మండలంలోని జ్యోతి గ్రామంలో పెన్నానది ఒడ్డున వెలసిన అత్యంత ప్రాచీన సిద్దవటేశ్వర స్వామికి మానస సరోవరం నుంచి తీసుకొచ్చిన పవిత్ర జలంతో అభిషేకం చేశామన్నారు. అభిషేకంతో పాటుగా స్వామి వారికి ప్రత్యేకంగా అలంకరణ చేసి సహస్రనామ కుంకుమార్చన, పలు అర్చనలు చేయడం జరిగిందన్నారు. సకాలంలో వర్షాలు పడి జ్యోతి గ్రామంలోని రైతులు పండించిన పంటలు చేతికి వచ్చి ఆర్థికంగా ఎదగాలని, ప్రజలు సుఖ సంతోషాలతో విలసిల్లాలని జ్యోతి సిద్ధవటేశ్వర స్వామిని కోరుకున్నామని వారు తెలిపారు.

## ఘనంగా పదవి విరమణ సమావేశం

**కడప మే 31 ప్రభాతవార్త:**
ఆంధ్రప్రదేశ్ హౌసింగ్ బోర్డు నందు 44 సంవత్సరాలు నిర్విరామంగా అం చెలంచలుగా ఉన్నత స్థాయికి చేరుకుని పదవి విరమణ పొందుతున్న మహ మ్మద్ షరీఫ్ 1982లో ఉద్యోగ బాధ్యతలు చేపట్టి 44 సంవత్సరాలు మచ్చ లేని ఉద్యోగిగా పనిచేసే హౌసింగ్ లో మచ్చలేని మనిషిగా పేరు తెచ్చుకున్నారు ఎటువంటి ధనార్జన లేకుండా నిస్వార్థ సేవ చేసి వారు అందించే చిరునవ్వుతో వారి మనలను పొందారు ఇతను కడప జిల్లా పోరుమామిళ్ల నెల్లూరు జిల్లాలో పలు ప్రాంతాల్లో హౌసింగ్ అధికారిగా పనిచేయడం జరిగింది. షరీఫ్ అంటే హౌసింగ్ హౌసింగ్ అంటే షరీఫ్ అని మచ్చలేని పేరు ప్రఖ్యాతలు పొందారు. ఈ సన్మాన కార్యక్రమంలో పెద్ద ఎత్తున బంధువులు స్నేహితులు తోటి అధి కారులు పాల్గొన్నారు ఈ సన్మాన కార్యక్రమం ఎల్ మోహన్ రెడ్డి ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్ మేనేజర్, వెంకటేశ్వరరావు వార్త సర్క్యులేషన్ ఇంచార్జ్ ఆధ్వ ర్యంలో సన్మాన కార్యక్రమం నిర్వహించారు ఈ కార్యక్రమానికి ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రంగయ్య వర్క్ ఇన్స్పెక్టర్ రమణయ్య రాజు స్వగృహ ఈజియం రాం బాబు రమేష్ ఎస్ సర్దార్ హుస్సేన్ రిటైర్డ్ ఎస్పై తోటి స్నేహితులు బంధు వులు పాల్గొన్నారు.















